
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 30-8-2024 15/-







సహజీవన భావాల సావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 36 హైదరాబాద్
శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 రూ.15-00
2 రబీఉల్ అవ్వల్ 1446 హిజ్రీ

**తొలిగీటు**

## తల్లిదండ్రులను దూషించడం మహాపాపం.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**

Morality is Freedom
JIH Women's Department September 2024

11



**స్వేచ్ఛ పేరుతో మోసపోవద్దు!**

## లోపల...

| | | |
|---|---|---|
| నైతికత నేటి అవసరం | ...... | 04 |
| నైతికత లేని విద్య దిక్సూచి లేని నౌక | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! – 45 | ...... | 08 |
| పిల్లల శిక్షణ ఒక కోణం | ...... | 12 |
| టెక్నాలజీ యుగంలో నైతిక విలువలు | ...... | 14 |
| రుఖయ్యా ఖాతూన్ | ...... | 16 |
| మంచి మాటలు స్వర్గానికి బాటలు | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ముస్లిములు – భారత నిర్మాణంలో పాత్ర | ...... | 20 |
| ఆరోగ్యం దేవుడు ఇచ్చిన గొప్పవరం | ...... | 24 |
| ఫెమినిజం ప్రచారాలు – ఇస్లాం వాస్తవాలు | ...... | 26 |
| యువతలో పెరుగుతున్న నేర ప్రవృత్తి | ...... | 28 |
| మిమ్మల్ని మీరు నరకాగ్ని నుండి కాపాడుకోండి | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |

## జైలు - బెయిలు




మొత్తానికి దొరికింది
కవితమ్మకు బెయిలు
వచ్చిందోయ్ ఇంటికి
వదిలి పెట్టి జెయిలు!
కాస్కో ఇక అంటు అక్క
విసురుతోంది సవాలు
పటాపట పండ్లు కొరికి
ఊగుతున్నది శిగాలు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# నైతికత నేటి అవసరం

**విద్యలేని వాడు వింత పశువు** అన్నారు మన పూర్వీకులు. కాని వారి కాలంలో విద్య సంస్కారాన్ని నేర్పేది. నైతికతను బోధించేది. ఇప్పుడు అలా ఉందా?

తెలివితేటలు, విద్యాజ్ఞానాలు, నీతినియమాలు – వీటి గురించి ఆలోచించినప్పుడు నీతినియమాలు లేకపోతే తెలివి తేటలున్నా సమాజాన్ని దోచుకుంటాడే కాని సమాజానికి ఉపయోగపడడం జరగదు. నీతినియమాలు లేకపోతే ఉన్నత విద్యాజానాలు కూడా సమాజానికి ఉపయోగపడవు. నీతినియమాలు మనిషి వ్యక్తిత్వాన్ని, నడవడికను తీర్చిదిద్దుతాయి. సమాజానికి కావలసింది ఇలాంటి వ్యక్తిత్వమున్న వ్యక్తులే. అత్యున్నతస్థాయి చదువులున్న వారు కూడా నేరాలకు ఎందుకు పాల్పడుతున్నారు? ఎందుకు నైతికంగా అధోపాతాళంలో కనిపిస్తున్నారు? ఇవి అందరం ఆలోచించుకోవలసిన ప్రశ్నలు.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ పిల్లల ఐక్యూ అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నారు. తెలివితేటలు సాటిలేనివిగా ఉండాలనుకుంటున్నారు. పెద్ద పెద్ద చదువులు చదవాలని ఉవ్విళ్ళూరుతున్నారు. కాని నీతినియమాలు కలిగిన ఉత్తమ వ్యక్తిత్వం కలవారుగా మారాలని కోరేది ఎంత మంది?

సమాజంలో భావజాలం, నెరెటివ్, సామాజిక ధోరణులు దీని వెనుక ఉన్నాయి. వరకట్నం చట్టపరంగా నిషిద్ధం. కాని బాహాటంగా కట్నమడగడానికి సంకోచించని వారున్నారు. అలాగే భారీగా కట్నమిచ్చామని గర్వంగా చెప్పుకునేవారూ ఉన్నారు. ఇదే పరిస్థితి లంచాలు, అవినీతి కుంభకోణాల్లోను ఉంది. అవకాశం ఉన్నప్పుడు సంపాదించలేకపోతే అసమర్థుడిగా సమాజం భావిస్తుందనే ధోరణి కనిపిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే అవినీతి, వరకట్నం, లంచాలు వగైరా రుగ్మతలతో సహజీవనానికి అలవాటు పడిపోయాం.

ఆధునికానంతర ప్రపంచంలో సమస్య ఏమిటంటే, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి ఎంత వేగంగా పురోగమిస్తుందో నైతిక అధోగతి అంతే వేగంగా దిగజారుతోంది. ఏపిజే అబ్దుల్ కలామ్ ఈ పరిస్థితిని ఒక్క వాక్యంలో చాలా చక్కగా చెప్పారు. మనకు గైడెడ్ మిస్సైళ్ళు ఉన్నాయి కాని మిస్ గైడెడ్ మనుషులున్నారు.

ఒక దేశం భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపొందుతుంది. ఆ తరగతి గదుల్లో నైతిక పాఠ్యాంశాలు లేకపోతే సంస్కారం నేర్పని విద్యే మిగులుతుంది. మార్టిన్ లూథర్ కింగ్ ఈ విషయాన్నే చాలా చక్కగా చెప్పాడు. Education which stops with efficiency may prove to be the greatest menace to society... Intelligence plus character — that is the goal of true education.

మనిషిలో సామర్థ్యాన్ని నైపుణ్యాలను పెంచితే చాలనుకునే విద్యా సమాజానికి శాపమైపోతుంది. ఉన్నత విద్యాజ్ఞానాలు, ఉత్తమ వ్యక్తిత్వం ఇదే నిజమైన విద్యాభ్యాసం. ఇదంతా చెప్పుకునే ఆదర్శమే కాని ఆచరణలో సాధ్యం కాదని భావించే ప్రబుద్ధులూ ఉన్నారు. తెలివిగా ఉండడం కొన్ని సందర్భాల్లో మోసగించబడకుండా మసలుకోడానికి ఉపయోగపడవచ్చు, కాని ప్రాక్టికల్‌గా ఉండడం కోసం ఇతరులను మోసగించడం నేరమవుతుంది. ఈ విచక్షణను నేర్పేదే నైతికవిద్య. అత్యంత కఠినమైన పరిస్థితుల్లో కూడా తమ వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా, ఉన్నత విలువలకు ప్రతీకలుగా నిలబడిన వారు కూడా చాలా మంది ఉన్నారు. ఇలాంటి వారే సమాజంలో ఆదర్శంగా పేరుపొందుతారు. ప్రాక్టికల్‌గా ఉంటున్నామనుకుంటూ స్వార్థప్రయోజనాల కోసం నైతిక ప్రమాణాలను బలిపెట్టేవారు గుంపులో ఒకరిగానే మిగిలిపోతారు. వారెంత తెలివైన వారైనా, ఎంత విద్యాజ్ఞానాలు కలిగిన వారైనా, వారి వల్ల సమాజానికి ఒరిగేది ఏదీ ఉండదు. ఉత్తమ వ్యక్తిత్వం లేని విద్య ఒక సాంఘిక సమస్య అన్నారు గాంధీజీ. కరోనా వచ్చినప్పుడు ఇదే జరిగింది. మనిషి మనిషికి దూరమయ్యాడు. కరోనాతో మనుషులే కాదు మానవత్వం కూడా చచ్చిపోయింది. కరోనా జిహాద్ పేరుతో విద్వేషశక్తులు రెచ్చిపోయాయి. చివరకు తల్లిదండ్రుల్లో ఎవరైనా చనిపోయినా అంత్యక్రియలు చేయించడానికి కూడా దగ్గరకు రాని సంతానాన్ని కూడా చూశాం. దీనికి ముఖ్యమైన కారణం నైతికత లోపించడమే. నీతినియమాల ఉత్తమ వ్యక్తిత్వం ఒక ఆదర్శం మాత్రమే కాదు సమాజానికి కాదనలేని అవసరం కూడాను.

అబ్దుల్ వాహెద్




# నైతికతలేని విద్య దిక్సూచి లేని నౌక

**ఇప్పుడు చిన్నపిల్లలను నర్సరీలో,** లోయర్ కేజీలో వేయాలన్నా లక్షల ఫీజులు కట్టవలసిన పరిస్థితి వచ్చింది. అధిక ధరల గురించి మనం మాట్లాడుతున్నప్పుడు మనమంతా చదువు "కొనడం" ఎంత కష్టంగా మారిందన్నది మరిచిపోతాం. ప్రభుత్వ పాఠశాలలున్నా ప్రమాణాలు, సదుపాయాలు వగైరా లోపాలతో సతమతమవుతున్నాయి. తగినన్ని ప్రభుత్వ పాఠశాలలు కూడా లేవు. తప్పనిసరిగా ప్రైవేటు పాఠశాలలే దిక్కు. ప్రైవేటు చదువు సప్తాకాశాల పైన ఉంది. ద్రవ్యోల్బణం విద్యా రంగంలో ఉన్నంతగా మరెక్కడా లేదనవచ్చు. గత 30 ఏళ్లలో పాఠశాల ఫీజులు తొమ్మిది రెట్లు, కళాశాల ఫీజులు ఇరవై రెట్లు పెరిగాయని అంచనా. పిల్లల చదువు ఖర్చులు భరించడం అంత సులభం కాదు. ఇప్పుడు విద్య లాభసాటి వ్యాపారం. ప్రభుత్వం విద్య కోసం, ప్రజారోగ్యం కోసం కేటాయింపులు కూడా తగ్గించేస్తుంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా నాణ్యమైన విద్యను అందించే పరిస్థితి లేదు.

దేశంలో పౌరులు ఉత్తమమైన మానవ విలువలు కలిగి ఉండడం, శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండడం, మూఢనమ్మకాలు, దురాచారాలకు దూరంగా ఉండడం, మద్యపానం వంటి వ్యసనాలకు, వరకట్నం వంటి దురాచారాలను నిర్మూలించడం జరగాలంటే విద్యా రంగం పటిష్టంగా ఉండాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచి వివిధ శాస్త్రాలతో పాటు నైతికపాఠాలు చదివించాలి. ఏది మంచి ఏది చెడు, ఏది తప్పు ఏది ఒప్పు వ్యత్యాసాన్ని నేర్పుతుంది నైతికత. దాతృత్వం, సేవాభావం, త్యాగనిరతులు ప్రజల్లో పెంపొందాలంటే నైతికపాఠాలు చిన్నప్పటి నుంచి నూరిపోయడం అవసరం. కాని ఇప్పుడు చదువు "కొనడం"గా మారిన పరిస్థితుల్లో కొనేవారు సంపాదనకు ఉపయోగపడే చదువు కోసమే చూస్తున్నారు. అమ్మేవారు కూడా సంపాదనకు ఉపయోగపడే చదువునే అమ్ముతున్నారు. ఇందులో నైతికపాఠాల ప్రస్తావన కూరలో కరివేపాకు అయ్యింది.

నైతిక విలువలు లేని విద్య వల్ల సమాజానికి లాభం లేదు. వ్యక్తిగత ప్రగతికి, డబ్బు సంపాదనకు అది ఉపయోగపడవచ్చు, కాని ఒక మంచి సమాజాన్ని నిర్మించడానికి తోడ్పడేదికాదు. దురదృష్టవశాత్తు, ప్రస్తుత విద్యా వ్యవస్థలో జరుగుతున్నది అదే. వ్యక్తిగతంగా సంపాదించడానికి ఉపయోగపడే, భౌతిక విజయాలు సాధించడానికి తోడ్పడే విద్యార్జనే నేడు లక్ష్యమైంది. నైతిక పురోగతిపై శ్రద్ధ కరువయ్యింది.

ఉన్నత చదువుల్లో మానవ విలువలు, వృత్తిపరమైన నైతికతల ఫౌండేషన్ కోర్సును చేర్చాలని విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ఇటీవల విశ్వవిద్యాలయాలకు లేఖ రాసిందని తెలుస్తోంది. విద్యాపరంగా బలమైన, నైతికంగా నిబద్ధత కలిగిన సమాజాన్ని స్థాపించాలంటే నైతిక ప్రమాణాల పట్ల శ్రద్ధ ఎంతైనా అవసరం.

నిజాయితీ, మంచితనం, కరుణ, పరోపకారం, సహాయసహకారాలు, గౌరవాదరాల వంటి విలువలను నైతికవిద్య ప్రోత్సహిస్తుంది, ఇవి వ్యక్తిగత వికాసానికి, సామాజిక సామరస్యానికి ఎంతైనా అవసరం. సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి, మానవ సంబంధాల్లో ఉత్తమ వ్యవహారశైలికి నైతికవిద్య మాత్రమే దారి చూపుతుంది.

నైతిక విలువలు కలిగిన విద్యార్థులు సామాజిక సమస్యల గురించి స్పష్టమైన అవగాహన కలిగి ఉంటారు. ఇతరుల పట్ల తమ బాధ్యత లను గుర్తిస్తారు. సమాజంలో శాంతి సామరస్యాలకు ఇది ఎంతో అవసరం. ఇలాంటి విద్యాబోధన చేసే విద్యా సంస్థలు దేశానికి గొప్ప నాయకులను, గొప్ప పౌరులను అందిస్తాయి.

నైతిక పాఠ్యాంశాలు లేని విద్యార్జన వల్ల జరిగే నష్టాలు అనేకం. ఉదాహరణకు జర్నలిజాన్నే తీసుకుందాం...

జర్నలిజం అనేది నమ్మకానికి అద్దంపట్టాలి. విశ్వసనీయతకు మారు పేరుగా ఉండాలి. నేడు అలాంటి పరిస్థితి ఉందా?

అబద్ధాలు, అసత్యాలు, అర్థసత్యాలు మీడియాలో వీరవిహారం చేస్తున్నాయి. కార్పొరేట్ గుత్తాధిపత్యాలు, పార్టీ ప్రయోజనాలు మాత్రమే ప్రధానంగా మారాయి. భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్విని యోగం చేయడం విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.

జర్నలిజం లేదా మీడియాలో నైతికత గురించి చర్చ చాలా పాతది. జాతీయ, అంతర్జాతీయ వేదికపై మితవాద పార్టీల ప్రభావం పెరిగిన నేపథ్యంలో మీడియాలో నైతికత అదే స్థాయిలో తిరోగమనం చూపిస్తుంది. టీవీ చర్చల్లో యాంకర్ పాలకపక్ష ప్రతినిధిగా మాట్లాడు తున్న ఉదాహరణలు అనేకం కనిపిస్తాయి. ఒక సముదాయం పట్ల విద్వేషాన్ని రెచ్చగొట్టే వైఖరి చూపించడం కూడా తరచూ చూస్తున్నాం. తటస్థ మీడియా సంస్థలు, జర్నలిస్టులను ట్రోలింగ్ చేయడం మామూలయ్యింది. బలహీన, అణగారిన వర్గాలను, ముఖ్యంగా ముస్లింలను విలన్లుగా చిత్రీకరించడం జరుగుతోంది. కరోనా వచ్చినప్పుడు కరోనా జిహాద్ పేరుతో జరిగిన ప్రచారాన్ని చూశాం. ఇది నైతిక పతనం కాక మరేమిటి? అబద్ధాల ప్రచారంతో వచ్చిన కేరళ స్టోరీ వంటి ప్రాపగాండ చిత్రాలు చేస్తున్నది కూడా అదే.

“దాదాపు అన్ని మీడియా సంస్థలు కార్పొరేట్ సంస్థల అదుపులో ఉన్నాయి. అందువల్ల, కార్పోరేట్ ప్రయోజనాలే ముఖ్యంగా మారాయి. ప్రభుత్వానికి వంతపాడడం ద్వారా ప్రయోజనాలు సాధించుకునే ప్రయత్నాలు పెరిగాయి.

ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా పాత్రికేయుల కోసం ఒక ప్రవర్తనా నియమావళిని ప్రవేశపెట్టింది. ఇది మీడియా సంస్థలకు కూడా వర్తిస్తుంది. వార్తాపత్రిక లేదా టీవీ ఛానల్ ఎటువంటి పక్షపాతం లేకుండా వాస్తవాలను నిజాయితీగా ప్రజలకు తెలియజేయాలి. నిష్పక్ష పాత వ్యాఖ్యలుండాలి. కాని ఈ మార్గదర్శకసూత్రాలను పట్టించు కుంటున్నది ఎవరు? అబద్ధాలు వండి వార్చే వార్తాసంస్థల వల్ల సమాజంలో ఉద్రిక్తతలు, వివిధ సముదాయాల మధ్య ఘర్షణలు, అమాయకులపై దాడులు జరగడం లేదా? మీడియాలో పక్షపాతం, సొంత ప్రయోజనాల కోసం పనిచేయడం పెరగడానికి కారణం నైతిక ప్రమాణాల రాహిత్యమే. సమాజంలో అలజడి సృష్టించే పుకార్లు, ప్రజల వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేసే ఆధారరహిత వార్తలు, అబద్ధాలు సమాజానికి ఎంతో హాని కలిగిస్తాయి. మీడియా వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాల నుండి స్వతంత్రంగా ఉండాలని, దాని ఆర్థిక ప్రయోజనాల గురించి పారదర్శకంగా ఉండాలని, నీతి మరియు ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని, పక్షపాతరహితంగా మరియు నిష్పాక్షికంగా ఉండాలని, పౌరులకు జవాబుదారీగా ఉండాలని పాత్రికేయ నైతికత డిమాండ్ చేస్తుంది.

సత్యాన్ని అసత్యంతో కలపడం, సత్యాన్ని దాచడం ఇస్లాంలో నిషిద్ధం. భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజలను తప్పుదోవ పట్టించకూడదు. అబద్ధాల ప్రచారంతో సమాజంలో విద్వేషాలను పెంచకూడదు. ఒక వార్త ఏదన్నావస్తే ముందు దాన్ని నిర్ధారించుకోవాలని చెబుతుంది ఇస్లాం. నిర్ధారణ లేని పుకార్లను వార్తలుగా వండి వార్చడం జర్నలిజం కాదు. అలాగే ఇస్లాం అసభ్యతను, అశ్లీలతను, అర్ధనగ్న ప్రదర్శనలను పూర్తిగా నిషేధిస్తుంది. జర్నలిజం అనేది నమ్మకానికి మరో పేరుగా ఉండాలి. మనిషి చేసే ప్రతి పనికి దేవుని ముందు జవాబు ఇవ్వా లంటుంది ఇస్లాం. నమ్మకానికి మారుపేరుగా ఉండవలసిన జర్నలిస్టు ఇస్లామీయ నైతికతకు నిబద్ధుడైతే, దేవుని ముందు జవాబు చెప్పుకో వలసి ఉందన్న బాధ్యతాభావమే నిజాయితీగా వృత్తి ధర్మానికి కట్టు బడేలా చేస్తుంది.

2024 లోక్‌సభ ఎన్నికలలో, దాదాపు మొత్తం మీడియా అధికార పార్టీకి మద్దతుగా నిలబడినప్పుడు, ప్రత్యామ్నాయ మీడియా మరియు యూట్యూబ్లో చురుకుగా ఉన్న జర్నలిస్టులు మంచి పాత్ర పోషించారు. ప్రధాన స్రవంతి మీడియా తన లోపాలను గ్రహించేలా మీడియా సంస్థలపై విమర్శనాత్మక నిఘా ఇప్పుడు ఎంతైనా అవసరం. పౌర సమాజం చురుకుగా ఉంటేనే ఇది సాధ్యం. ఇదే పరిస్థితి మనం న్యాయవ్యవస్థలో కూడా చూడవచ్చు. న్యాయవాది తన క్లయింటును కాపాడ్డానికి ప్రయత్నిస్తాడా? లేక న్యాయాన్ని నిలబెట్టడానికా?

నైతిక పాఠాలు అవసరమైన మరో రంగం శాస్త్ర సాంకేతిక రంగం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని నేరుగా ప్రభావితం చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ, దాని నైతిక చిక్కులు, సవాళ్లు కూడా ముందుకు వస్తున్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కోవటానికి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో నైతిక సూత్రాలను దృష్టిలో ఉంచుకుని తగిన విధివిధానాలు రూపొందించు కోవలసిన అవసరం కూడా ఉంది. మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాం. ఈ సాంకేతిక పరిజ్ఞానం జీవితాన్ని సులభతరం చేయడంతో పాటు సమాజంపై సానుకూల, ప్రతికూల ప్రభావాలు కూడా వేస్తుంది. డిజిటల్ ప్రపంచంలో గోప్యత ఒక ముఖ్యమైన నైతిక సమస్యగా మారింది. మన వ్యక్తిగత జీవితం లోని వివిధ అంశాలను ఆన్లైన్లో తరలిస్తున్నప్పుడు, మన డేటాను వివిధ కంపెనీలు, ప్రభుత్వాలు సేకరిస్తున్నాయి. మన గుర్తింపు,

మన అలవాట్లు, మన ఆసక్తులు, మన రోజువారీ జీవితం, మన ప్రణాళికలు, మన వ్యక్తిగత సంబంధాలు, మన ఫోటోలు అన్ని ఆన్లైన్లోకి వెళుతున్నాయి. అయితే ఈ డేటా ఎంత వరకు సురక్షితంగా ఉంది. దురుపయోగం కాకుండా ఉందా? ఈ డేటాను ఎవరు ఏ ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నారు? ఇవి నైతిక ప్రశ్నలు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) అభివృద్ధి తర్వాత స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగల వ్యవస్థలు నిర్మించబడుతున్నాయి. ఉదాహరణకు, సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు మానవ జోక్యం లేకుండా రోడ్లపై నడుస్తాయి. ఒకవేళ ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అనేది ప్రశ్న. నైతిక నిర్ణయాలు తీసుకునే శక్తిని మనం ఒక యంత్రానికి ఇవ్వగలమా? సమస్యలు సాంకేతికంగా మాత్రమే కాకుండా నైతికంగా కూడా ఉంటాయి. అలాగే చాట్ జిపిటి వంటి జనరేటివ్ ఏఐ పరికరాలు వివక్షకు అతీతంగా వ్యవహరించలేవు. దీనిపై చర్చలు కూడా జరిగాయి. ఈ వివక్షలను అరికట్టేది ఎలా? ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తీసుకునే నిర్ణయాలు మనిషి తీసుకునే నిర్ణయాలతో సమానమా? ఒక కంపెనీకి సియీవోగా ఒక ఏఐ వ్యవస్థను నియమించే పరిస్థితి రావచ్చు. అలాంటి కృత్రిమ మేధస్సు హ్యూమన్ రిసోర్స్ మేనేజిమెంటులో మానవీయ విలువలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోగలదా?

జన్యు ఇంజనీరింగ్, బయోటెక్నాజీలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. దీనితో, మనం జన్యు వ్యాధులకు చికిత్స చేయవచ్చు, మానవ జన్యువులో మార్పులు చేయవచ్చు. ఇందులో అనేక నైతిక ప్రశ్నలు కూడా ఉన్నాయి. మానవ జన్యువును మార్చే అనుమతి ఇవ్వవచ్చా? ఇది ప్రకృతి నియమాలకు విరుద్ధం కాదా?

సాంకేతిక పరిజ్ఞానం మానవులపైనే కాకుండా మన పర్యావరణంపై కూడా ప్రభావం చూపుతుంది. పారిశ్రామిక విప్లవం నుండి సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. వాయు కాలుష్యం, వాతావరణ మార్పు, సహజ వనరుల వృధా వంటి సమస్యలకు పరిష్కారాలు అన్వేషించాలి. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని రెండు భాగాలుగా విభజించింది. ఒక వైపు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందగలిగిన వారు ఉన్నారు, మరోవైపు దీనిని కోల్పోయిన వారు ఉన్నారు. ఈ వ్యత్యాసాన్ని డిజిటల్ విభజన అంటారు. ఈ అసమానత సామాజిక అన్యాయం, ఆర్థిక అసమానతలకు దారితీస్తుంది. అందువల్ల ప్రతి వ్యక్తికి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో తేవడం సామాజిక న్యాయానికి అవసరమవుతుంది.

సాంకేతిక పరిజ్ఞానం ప్రతికూల ప్రభావాలను నివారించడానికి నైతికత ఎంతో అవసరం. సాంకేతిక ప్రగతికి సంబంధించిన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకునే బలమైన నైతిక చట్రాన్ని మనం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే మనం మరింత న్యాయమైన, స్థిరమైన భవిష్యత్తు సాధించగలం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో ఉపయోగించడం అనేది మన సామాజిక, ఆర్థిక మరియు వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం. నైతిక సూత్రాలకు అనుగుణంగా ఉపయోగిస్తే, హక్కులు, ప్రయోజనాలను కాపాడు తుంది. మానవ సంక్షేమానికి ఉపయోగపడుతుంది.

ఏది ఏమైనా విద్యారంగంలో నైతిక పాఠ్యాంశాలకు ప్రాముఖ్యం ఇవ్వడం ద్వారా వివిధ రంగాల్లో తలెత్తే నైతిక సమస్యలకు సమాధానాలు సాధించవచ్చు.

ఇస్లాం ప్రకారం ఈ ప్రాపంచిక జీవితం తరువాత మరణానంతర జీవితం ఉంది. ఇస్లామీయ విద్యావిధానంలో ఇహపరలోకాల్లో అత్యున్నత లక్ష్యాలను సాధించడం ముఖ్యం. కాని కేవలం ప్రాపంచిక జీవితమే ప్రధానంగా భావించే విద్యావ్యవస్థల్లో నైతిక ప్రమాణాలు ద్వితీయస్థాయికి నెట్టేయబడతాయి. ఇహలోక ఆనందాలు, సౌకర్యాలు, సుఖవిలాసాలే ప్రధానంగా మారుతాయి. ఇస్లామీయ విద్యా వ్యవస్థ ముఖ్యఉద్దేశ్యం నీతిమంతమైన సమాజ నిర్మాణం. కూలివాడి చెమట ఆరకముందే కూలి చెల్లించాలంటుంది ఇస్లాం. అలా చేయకపోతే దేవుడి ముందు హాజరై పరలోకంలో జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. పొరుగువాడి హక్కులను గుర్తించాలం టుంది. మహిళలను గౌరవించాలంటుంది. ప్రళయం వస్తున్నా సరే చేతిలో ఒక మొక్క ఉంటే దాన్ని నేలలో పాతాలని బోధిస్తుంది. రోగులను పరామర్శించాలంటుంది. పేదలను ఆదుకోవాలంటుంది. తూకాలు కొలతల్లో అవినీతికి పాల్పడరాదని కఠినంగా నిషేధిస్తుంది. చూపులను కాపాడుకోవాలని చెబుతుంది. ఈ నైతిక విలువలు ఒక మంచి సమాజాన్ని నిర్మించడానికి ఎంతో అవసరం. ఈ ప్రమాణాలు లోపించడం వల్లనే అవినీతి, నేరాలు పెరుగుతున్నాయి.

మంచి చేయడానికి, చెడును నివారించడానికి ఉపయోగపడేదే నిజమైన విద్య. నైతికాంశాలతో కూడుకున్న విద్యాబోధన మాత్రమే ఇలాంటి విద్యను అందిస్తుంది.

కేవలం ప్రపంచమే ప్రధానంగా భావించే విద్యా వ్యవస్థ అద్భుతమైన ఇంజనీర్లు, సమర్థులైన వైద్యులు, తెలివైన తత్వవేత్తలను తయారు చేస్తుంది కానీ నీతినియమాలకు కట్టుబడే మనోబలాన్ని పెంచదు. అందువల్లనే అవినీతి, నేరాలు పెరుగుతున్నాయి. నేడు సైబర్ క్రయింకు పాల్పడుతున్న వాళ్ళు నిపుణులైన కంప్యూటర్ ఇంజనీర్లే కదా. కలకత్తాలో ఇటీవల జరిగిన అత్యాచారం హత్య కేసుల్లో నింది తులు బాగా చదువుకున్నవారే కదా. విద్య నేరాలను తగ్గించి, సమాజ శ్రేయస్సును కోరుకునే వ్యక్తుల సంఖ్యను పెంచాలి. కానీ దీనికి విరుద్ధంగా జరుగుతోంది. విద్యావంతులైన నేరస్థుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అందువల్ల పాఠ్యాంశాల్లో నైతికత తప్పనిసరి సిలబసుగా ఉండాలి. ✤

అధ్యాయం -17

45

# 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎమ్. మలిక్

## మక్కా విజయం, హునైన్ పోరాటం

హిజ్రీ 8వ సంవత్సరమే రమజాన్ నెలలో 10వ తేదీన దైవ సందేశహరులు 10 వేల మంది సహచరుల్ని వెంట బెట్టుకుని మక్కా వైపునకు బయలుదేరారు. చుట్టుపక్కల, దారి వెంట అనేక తెగల వారు తమ నాయకుని వెనకాల తన్మయత్వంతో ఆనందంగా రావడం మొదలెట్టారు. అయితే ఒక జెండా అన్నింటి కన్నా పెద్దది, అందరి కన్నా ముందుండేది. దాన్ని మహనీయ సఅద్ బిన్ ఉబాద పట్టుకు వస్తున్నారు.

మర్రుజ్జుహ్రాన్ అనే చోట ఆ రాత్రి బస చేసి తెల్లవారాక ఈ దైవ భక్తులు మక్కాకు చేరువయినప్పుడు మహనీయ సఅద్ దృష్టికి అబూ సుఫ్యాన్ కనిపించారు. వెంటనే సఅద్ ఉద్రేకంతో బిగ్గరగా పాడసాగారు:

**"నేడు పోరాట దినం**
**నేడు నిషిద్ధమయినది కూడా**
**అనుమతించబడింది!"**

ఇది విన్న విశ్వ కారుణ్య స్వరూపులు(స) దీని పర్యవసానం ఊహించారు, శిక్షగా ధ్వజం ఆయన్నుంచి గ్రహించి (ఓ ఉల్లేఖనం ప్రకారం) అబూ తాలిబ్ సుతుడు, 'మట్టి బాబు', 'దేవుని బెబ్బులి' అలీ చేతికి అప్పజెప్పారు. మహనీయ ఇబ్రాహీమ్(అ) నిర్మించిన పవిత్ర నిషిద్ధస్థలి కాబాను పరిశుద్ధ పరచడానికి వస్తున్న విగ్రహ విరోధీవర్గ ధ్వజం ఇప్పుడు మహనీయ అలీ(ర) చేతిలో ఉంది.

దేవుని సిపాయీల సైన్యం విభిన్న దిశల నుండి మక్కా నగరంలోకి ప్రవేశించింది. మహనీయ అలీ (ర) బృందం 'జీ తువా' వైపు నుంచి ప్రవేశించింది. మానవ శ్రేష్ఠులు, శ్రేష్ఠజన నిర్మాత, ఉత్తమోత్తమ మార్గ బోధకులు, ప్రవక్తశ్రీ(స), సఅద్ బిన్ ఉబాద(ర) భావనల్ని కూడా గమనించి ఉంటారు, అందువల్లనే నేమో కొంత సేపటి తరువాత, "ఈవేళ మీ పైన ఎలాంటి ఆంక్షలు లేవు, వెళ్ళండి మీరంతా స్వేచ్ఛ పొందారు" అని మక్కా వాసుల నుద్దేశించి ప్రకటించారు. ఇది ప్రాణ శత్రువులకు కూడా శరణ్యం ఇచ్చే ప్రప్రథమ ప్రకటన.

## సర్వసామాన్య మన్నింపు

మక్కా నగరాన్ని వశపరచుకున్న తరువాత విశ్వ కారుణ్య

స్వరూపులు మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహివ సల్లమ్) ప్రకటన వెలువడింది,

'మక్కా వాసులలో ఏ వ్యక్తి పట్ల కూడా ప్రతీకారం తీర్చుకోవడం జరగదు, మన్నింపు, క్షమాపణలేకాక ప్రేమ, కారుణ్య వైఖరి నవలంబించడం జరుగుతుంది.'

అయితే కొందరు మాత్రం ప్రత్యేకంగా అతి హీనమయిన అపరాధాలకు ఒడిగట్టిన వారున్నారు, వారికి దైవాదేశం ప్రకారం మరణ దండన విధించడం జరిగింది. వారిలో హువైరిస్ బిన్ నుఫైల్ అనే వ్యక్తి హిజ్రత్‌కు పూర్వం ముస్లిముల ఎడల ఎనలేని దౌష్ట్యాలకు పాల్పడిన వాడు, సరిగ్గా మక్కాలోకి ప్రవేశించిన రోజున మహనీయ అలీ(ర) కంట పడ్డాడు. వెంటనే ఆయన తన కరవాలంతో అతన్ని అంతమొందించారు.

కాబా గృహాన్ని విగ్రహాల నుండి ప్రక్షాళించి మక్కా పుర వాసుల చేత విధేయతా ప్రమాణం చేయించిన తరువాత ప్రవక్తశ్రీ(స) మక్కా చుట్టుపట్ల ప్రాంతాల్లో జనులకు విగ్రహారాధన లోని చెడుగుల్ని బోధపరచి ఒకే దేవుని ఆరాధన వైపునకు ప్రేరేపించడానికి కొన్ని బృందాలను పంపారు. వాటిలో ఒకటి మహనీయ ఖాలిద్ బిన్ వలీద్ ఆధ్వర్యంలో, బనూ కనాన తెగ వద్దకు వెళ్ళింది. కాని వారు ఆ బోధనను ఏ మాత్రం పట్టించుకోలేదు. అయితే 'సైఫుల్లా'(దేవుని కరవాలం) ఖాలిద్ బిన్ వలీద్ తన కత్తితో వారికి 'బోధ'పరచి వారి సొత్తు యావత్తు వశపరచుకున్నారు!

## మార్పునకు మార్గం

ఆయన తిరిగి వచ్చి ఆ గాథనంతా ప్రవక్త మహనీయులకు వినిపించారు. ఆయన(స) తన తీవ్ర అయిష్టతను వెలిబుచ్చారు. పైగా ఆ సామగ్రి అంతా ఇచ్చి మహనీయ అలీ (ర)ని కనాన తెగ వారి వద్దకు తిరిగి పంపించారు. మహనీయ అలీ(ర) వారి సొత్తు వారికి అప్పగించారు ఇంకా హతులయిన వారి రక్త పరిహారం కూడా ఆ కుటుంబీకులకు అందజేశారు. దైవ సందేశహరులు(స) శక్తినుపయోగించి ఏ విధంగా నయినా దేశాలను వశపరచుకోవాలని బోధించలేదు. ఇంకా జనుల్లో మార్పు అన్నది చేతి బలంతో కాదు, మానసిక శక్తి ద్వారానే రావాలని మాత్రమే ఉపదేశించారు.

ఇస్లామీయ వ్యవస్థలోని ఈ వైశిష్టిని గురించి తమలో తాము చర్చించుకుని ప్రజలు త్వరగానే సత్యాన్ని గ్రహించారు, దాన్ని స్వీకరించారు. ఆ తరువాత హృదయ పరివర్తనా ఉద్యమ నేత ప్రవక్తశ్రీ(స) మహనీయ అలీ(ర)ని విభిన్న తెగల వద్దకు సత్యధర్మ కాంతిని వ్యాపింప జేయడానికి పంపారు. ఆయన బోధనోపదేశాల ద్వారా ఆ ప్రాంత ప్రజలకు తమ జీవితాలను సన్మార్గాన తీర్చిదిద్దుకునే అవకాశం కల్పించారు. ఈ విధంగా ఆ ప్రాంతమంతా సత్యజ్యోతితో వెలిగిపోయింది.

## మక్కా విజయం పర్యవసానం

ప్రవక్తశ్రీ(స) నిర్వహించిన మక్కా యాత్ర, విజయ గాథ అరేబియా భూభాగాన్ని కుదిపి వేసింది. అరబ్బులు ఏమరుపాటు నుంచి తేరుకున్నారు. కాబా గృహం బూటకపు దేవుళ్ళ నుంచి ప్రక్షాళితమయింది. సందేహాలతో కొట్టుమిట్టాడే జనం ఈ విజయంతో సత్యాన్ని స్వీకరించి సఫలురయ్యారు. అయినా కొన్ని తెగల ఇస్లామ్ పట్ల దురభిమానం చేత వారి వరకు అజాన్ పిలుపు ఇంకా చేరనే లేదు. ఇలాంటి వారిలోనే హవాజిన్, సకీఫ్ కూడా ఉన్నాయి. వారు ముస్లిముల విరోధంలో గుడ్డి వారిగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం అందింది.

అప్పటికి ఇంకా ప్రవక్త మహనీయులు (స) మక్కాలోనే ఉన్నారు. కనుక సిపాయీలను సిద్ధం చేసుకుని బయలు దేరారు ప్రవక్తశ్రీ(స). సేన ధ్వజం మహనీయ అలీ(ర)కి అప్పజెప్పడం జరిగింది. హునైన్ లోయ చేరేసరికి ఇంకా మసక చీకటి ఉండగానే సిద్ధంగా ఉన్న శత్రువులు దాడి జరిపారు. ముస్లిములు చిందువందు అయిపోయారు. కొందరు మాత్రమే ప్రవక్తశ్రీ(స) వద్ద రక్షణ కొరకు ఉండి పోయారు. వారిలో మహనీయ అలీ(ర) కూడా ఉన్నారు.

ఆయన తన ధైర్యశౌర్యాలను బాగా వినియోగించారు. ఆయన గమనించారు, హవాజినుల ఓ వ్యక్తి నల్ల జెండా చేత బూని మాటు కాచి జనాన్ని సంహరిస్తున్నాడు. హవాజినుల స్థయిర్యానికి వెనుక ఉన్నది ఇతని చాకచక్యం అని గమనించారు. ఆయన మరో అన్సారీ సహచరునితో కలసి అతని పైకి దాడి జరిపి ఒంటెపై నుంచి పడగొట్టారు. అంతే, అది చూడగానే ఇంకా అనేక మంది వారితో వచ్చి చేరారు. అంతా కలసి గట్టిగా ఎదురు దెబ్బ తీశారు. చిందర వందర అయిన ముస్లిములు వచ్చి కలుసుకున్నారు. ఫలితంగా వైరి వీరులు పారిపోయారు. పరాజితులయిన ముస్లిములకు విజయం పాదాక్రాంతమయింది.

## హాతిమ్ తాయి సంతానం

హి(జ్రీ 9వ సంవత్సరంలో మహనీయ అలీ(ర) నేతృత్వంలో దైవ సందేశహరులు(స) 150 మంది అన్సారుల ఓ సైనిక బృందాన్ని బనూ తయ్ వైపునకు పంపారు. దారిలో రేయి ఆవరించగా మజిలీ వేశారు. అక్కడ ఓ బానిస సిపాయీల మధ్య సంచరిస్తూ కనిపించాడు. అతన్ని బంధించి మహనీయ అలీ వద్దకు తెచ్చారు పహారా కాసే సిపాయీలు. అతన్ని గట్టిగా మందలించి విచారణ జరిపితే తేలింది, అతను బనూ తయ్ నుంచి వచ్చినట్లు.

ఆ బానిసనే తమకు దారి చూపడానికి నియమించుకున్నారు. అతను చెప్పినట్లే బాగా ఆలోచించి తెలతెల వారుతుండగా ఆ ఊరిపై దాడి జరిపారు. ఫలితంగా విశ్వ విఖ్యాత దాన శీలుడు హాతిమ్ తాయి కుమార్తె అక్కడ చేజిక్కారు. వారిలో ఇద్దరు, ముగ్గురు ప్రతిఘటించిన వారు తప్ప మిగిలిన వారు అందరూ సునాయాసంగా లొంగిపోయారు. అందరికీ ఇస్లామ్ సందేశం బోధపరచడానికి ప్రయత్నం చేశారు ముస్లిములు. కొంత మంది ఇస్లామ్ స్వీకరించారు. దారి చూపిన బానిస కూడా ఇస్లామ్ స్వీకరించాడు.

అందరినీ ప్రవక్తశ్రీ(స) వద్దకు తీసుకు వచ్చారు. ప్రవక్త మహనీయులు(స) హాతిమ్ తాయి కూతురు సఫానా కోరిక మేరకు ఆమెను ఆమె సోదరుడు అదీ బిన్ హాతిమ్ తాయి వద్దకు ఓ వాహనం, అవసరమయిన భోజన సరకు ఇచ్చి పంపించి వేశారు. ఆమె అక్కడికి చేరిన తరువాత అదీకి నచ్చ జెప్పి దైవ సందేశహరుల సన్నిధిలోకి అతన్ని పంపగలిగారు. అప్పుడు ఆయన(స) తన సహచర మాన్యులతో మస్జిద్‌లో ఉన్నారు.

అదీని పరిచయం చేశారు సహచరులు. ఆయన(స) అతని చెయ్యి తన చేతిలో తీసుకుని తన గది వైపునకు బయలు దేరారు. అంతలో ఓ మహిళ చంకలో తన బిడ్డను యెత్తుకుని వచ్చి ఏదో విన్నవించుకో సాగింది. ఆయన(స) ఆమె కొరకు ఆగిపోయారు. ఆమె తన గోడు చాలా సేపు చెప్పుకుంటూనే ఉంది, ఆయన వింటూనే ఉన్నారు. ఆ పైన ఆయన ఆమె పని ఏదో చేసి పెట్టి తనతో ఇంటికి చేరారని అదీ అనుకున్నారు,

"ఈయన రాజు వంటి వ్యక్తి కాడు, రాజులలో ఇంతటి సహనం, ఔదార్యం ఉంటుందా?"

ఆయన లోనికి వచ్చి ఖర్జూరపు ఆకులు నింపిన దిండు ఒకటి వేసి అదీని కూర్చోబెట్టారు. స్వయంగా తాను క్రింద కూర్చున్నారు. ఇక సుదీర్ఘ సంభాషణ జరిగింది. ఆ సంభాషణ ఫలితంగా అదీ ఇస్లామ్ స్వీకరించారు. ప్రవక్తశ్రీ(స) ముఖార విందం ఆనందంతో విప్పారింది. ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

రిపోర్టు



# స్వేచ్ఛ పేరుతో మోసపోవద్దు!

## 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' జాగృతి ఉద్యమం

**స్వేచ్ఛ..** అంటే కళ్లెంలేని గుర్రంలా ఇష్టమొచ్చినట్లు జీవించడం లేట్ నైట్ పబ్ కల్చర్.. నచ్చినట్లు ఉండటం.. ఇదే ఇప్పుడు స్వేచ్ఛగా మారిపోయింది. ఎలాంటి హద్దులు లేకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించడమే స్వేచ్ఛగా భావిస్తున్నారు. ఈ మితిమీరిన స్వేచ్ఛ ఎలాంటి అనర్థాలకు దారితీస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. నైతికత లేని స్వేచ్ఛ సమాజాన్ని ఎటు తీసుకెళుతుందో నిత్యం జరుగుతున్న ఘటనలే నిదర్శనం. నైతికంగా దిగజార్చే స్వేచ్ఛ నిజమైన స్వేచ్ఛ కాదు. స్వేచ్ఛ పేరుతో మన సంస్కృతి, సంప్రదాయాలపై జరుగుతున్న దాడిగా చెప్పొచ్చు. స్వేచ్ఛ అనేది నైతికతకు పునాదులు వేయాలే కానీ, అనైతిక కార్యకలాపాలకు కారణం కాకూడదు. నైతిక సరిహద్దులలో ఉండే స్వేచ్ఛ మనిషికి రక్షణ కవచంలా ఉంటుంది. నైతిక పరిధి దాటిన స్వేచ్ఛ ఎన్నో అనర్థాలకు కారణమవుతుంది. మితిమీరిన స్వేచ్ఛతో బ్రతికే వారిపై ఎలాంటి ఆంక్షలు లేవు. వారినెవరూ ప్రశ్నించరు. కానీ నైతిక స్వేచ్ఛపై ఎన్నో ఆంక్షలు పెడుతున్నారు. ప్రజలైనా, సమాజమైన, ప్రభుత్వాలైనా నైతిక స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తున్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. యువతను తప్పుదారిపట్టించే అర్ధనగ్న దుస్తులు ధరిస్తే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేదు. ఇది అమ్మాయిల స్వేచ్ఛ అని అంతా గొప్పగా చెప్పుకుంటారు. అదే అమ్మాయిలు నైతికంగా, హుందాగా ఉండే హిజాబ్ ధరిస్తే మాత్రం ఎక్కడ లేని అభ్యంతరాలు పుట్టుకొస్తున్నాయి. నైతిక స్వేచ్ఛను పాటించేందుకు సుప్రీంకోర్టు మెట్టెక్కాల్సిన అవసరం ఏర్పడుతుందంటే పరిస్థితి ఎంతలా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్న మితిమీరిన స్వేచ్ఛ అనర్థాల గురించి రాసుకుంటూ పోతే పేజీలు సరిపోవు. ముఖ్యంగా మన సొసైటీలో స్త్రీలు, అమ్మాయిలు, యువతులు స్వేచ్ఛ, సమానత్వం పేరుతో మోసపోతున్నారు. స్త్రీలను డబ్బు సంపాదించే యంత్రంగా, తమ వ్యాపార సామ్రాజ్యాన్ని పెంచుకునే సాధనంగా వాడుకుంటున్నారు. సమాజంలో ప్రబలుతున్న జాడ్యాలను అడ్డుకోవాలంటే స్వేచ్ఛ పేరుతో జరుగుతున్న దాడుల్ని అడ్డుకోవాలి. నైతిక విలువలతో కూడిన స్వేచ్ఛ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని జమాఅతె ఇస్లామీహింద్ మహిళా విభాగం గుర్తించింది. సెప్టెంబర్ నెల సాంతం 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' పేరుతో ప్రచార ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఈ ప్రచారంలో భాగంగా ప్రజల్ని నిజమైన స్వేచ్ఛ నైతికతపై ఆధారపడి ఉంటుందనే ఆలోచనను కల్గిస్తారు. ఈ క్యాంపెయిన్ సన్నాహక కార్యక్రమం ఇటీవలె హైదరాబాద్ జమాఅత్ ఇస్లామీహింద్ తెలంగాణ స్టేట్ ఆఫీసులో జరిగింది. జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ ఖాలిద్ ముబష్షిర్ జఫర్, హాఫిజ్ రషాదుద్దీన్ ఈ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో జమాఅతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు. నెల రోజులపాటు జరిగే ఈ క్యాంపెయిన్ కన్వీనర్‌గా డాక్టర్ అస్రా ముహ్సినా వ్యవహరిస్తారు. క్యాంపెయిన్‌లో భాగంగా నైతిక స్వేచ్ఛ గురించి, స్వేచ్ఛ పేరుతో జరుగుతున్న మోసాల గురించి కరపత్రాల ద్వారా వివరిస్తామని డాక్టర్ అస్రా చెప్పారు. నైతిక విలువల్ని ప్రోత్సహించే పలు వీడియో సందేశాలను సోషల్ మీడియాలో ప్రచారం కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ క్యాంపెయిన్లో పెద్ద ఎత్తున మహిళలు, యువతులు, విద్యార్థినిలు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ✤

# పిల్లల శిక్షణ ఒక కోణం



- నసీరా బేగం

మనిషి జీవితంలో నైతిక విలువలకు ఎనలేని ప్రాముఖ్యత ఉంది. అన్ని కాలాలలో దాని ప్రాముఖ్యత సమానంగా ఉంది. ఎప్పుడైతే, ఎక్కడైతే సమాజంలో నైతిక విలువల పతనం ప్రారంభ మైందో అక్కడ ప్రవక్తలు, మహనీయులు అవిరళ కృషి చేసేవారు. సమాజం పతనం కాకుండా కాపాడుకునేవారు. ఈ విధంగా నైతిక విలువలతో కూడిన ఉత్తమ సమాజ నిర్మాణం ఉనికిలోకి వచ్చేది. సమాజం ఉత్తమంగా ఉండాలంటే ఆ సమాజంలోని ప్రజలు అంటే ప్రతి మనిషి నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. అనైతికతకు దూరంగా ఉండాలి. ప్రస్తుత సమాజంపై దృష్టి సారిస్తే అసంఖ్యాకమైన రుగ్మతలు అతివేగంగా ప్రబలుతున్నాయి. కార్చిచ్చు మాదిరిగా మొత్తం సమాజాన్ని ఆక్రమించుకుంటు న్నాయి. దీనికి ముఖ్యంగా యువతీ యువకులు గురవుతున్నారు. ఆకర్షితులవుతున్నారు. మత్తుపానీయాలు, వ్యభిచారం, అక్రమ సంబంధాలు, అత్యాచారాలు, హత్యలు, ఆత్మహత్యలు, దొంగతనం, దోపిడీలు సర్వసామాన్యమై పోతున్నాయి. వీటిని అరికట్టడానికి చేస్తున్న ప్రయత్నాలు ఏ మాత్రం సరిపోవడం లేదనేది స్పష్టంగా తెలుస్తోంది. నేటి సమాజాన్ని చూస్తూ ఉన్నట్లయితే మున్ముందు మన సంతాన భవిష్యత్తు, మన జాతి భవిష్యత్తు ఏమైపోతుందో అనే ఆందోళన కలుగుతుంది. ఎందుకంటే మనిషి శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఈ రోజు మనం చూస్తూనే ఉన్నాము. నేటి ఈ యువత ఈ రుగ్మతలకు అలవాటుపడిన కారణంగా మనశ్శాంతికి దూరమైపోతోంది. వెనక్కి వెళ్ళలేక ముందుకు సాగలేక ఆత్మహత్యలకు పాల్పడుతోంది.

ఈ రుగ్మతలను మొక్కలోనే త్రుంచటానికి వారిలో నైతిక విలువలను పెంపొందించటానికి మొట్టమొదటి ప్రయత్నం ఏమిటంటే, మనిషికి పుట్టుకతోనే మంచి శిక్షణ లభించాలి. నైతిక విలువలను బోధించాలి. దీని బాధ్యత మొట్టమొదట తల్లిదండ్రులపై అధికంగా ఉంటుంది. అందులోను తల్లిపై ఇంకా ఎక్కువగా ఉంటుంది.

మొట్టమొదట తల్లిదండ్రులు తమ పిల్లలను దైవానుగ్రహంగా భావించాలి. వారి శిక్షణ తమపై బాధ్యతగా ఉన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇంకా వారిని తమ కళ్ళకు చల్లదనాన్ని ప్రసాదించే వారిగాను, దేశ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దే మంచి పౌరులుగాను తయారు చెయ్యాలి. దీనికోసం తల్లిదండ్రులు తమ సంతానాన్ని ప్రేమించాలి, ప్రేమను పంచి పెట్టాలి. కాని అతి గారాబం చెయ్యరాదు. ప్రేమ వేరు, గారాబం వేరు. ప్రేమ వారి భవిష్యత్తును తీర్చిదిద్దితే గారాబం వారి భవిష్యత్తును కూల్చివేస్తుంది. తల్లిదండ్రుల జీవితాలు పిల్లలకు ఒక పుస్తకం లాంటివి. ఆ పుస్తకాన్ని వారి పిల్లలు చదువుతారు. వాటి నుంచే పాఠాలు నేర్చుకుంటారు. వాటిని తమ జీవితంలో అమలు చేస్తారు.


పిల్లలకు యుక్త వయసు వచ్చేవరకు అంటే బయటి ప్రపంచంలో అడుగుపెట్టే వరకు తల్లిదండ్రుల జీవిత పుస్తకాన్నే వారు

ఎక్కువగా అధ్యయనం చేస్తారు. వాటి నుంచే ప్రభావితం అవుతారు. వారి ఈ పాఠాలు పిల్లలకు వారి భవిష్యత్తులో మార్గదర్శిగా పనికొస్తాయి. తల్లిదండ్రులు వారి పట్ల చూపించే ప్రేమ, వారితో గడిపే విధానం, వారి సమయ పాలన, క్రమశిక్షణ, వారి ధార్మికత, వారి సంభాషణ, ఇతరులతో వారి సత్సంబంధాలు, సమాజానికి వారిచ్చే ప్రతిభా పాటవాలు, సమాజాన్ని వారు తీర్చిదిద్దే విధానం, సమాజం పట్ల వారికున్న గౌరవం, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దటానికి వారు చేసే అవిరళ కృషి ఇవన్నీ ఉత్తమ పాఠాలుగా వారి మస్తిష్కంలో పదిలమైపోయి ఉంటాయి.

అదేవిధంగా తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు లేకపోవటం, ఇద్దరూ తరచూ పిల్లల ముందు దెబ్బలాడుకోవటం, ఇతరుల ముందు ఒకరిని గురించి మరొకరు వారి బలహీనతలను ప్రస్తావిస్తూ ఉండటం, ఒకరిపై మరొకరు అలగటం, తల్లి తండ్రి గురించి చెడుగా చెప్పటం, తండ్రి తల్లి గురించి చెడుగా చెప్పటం, సమయ పాలన లేకపోవడం, బద్ధకం, కోపం, పిల్లలను గాలికి వదిలేసి ఇతరుల గురించి చాడీలు చెప్పుకుంటూ కూర్చోవటం, బంధువుల పట్ల సత్ప్రవర్తన లేకపోవటం, సమాజం పట్ల గౌరవం లేకపోవడం, తమ ప్రతిభా పాటవాలను మూలన పడవేయటం, విచ్చలవిడిగా జీవించటం, మత్తు పదార్థాలకు అలవాటుపడి ఉండటం, స్త్రీల పట్ల గౌరవం లేకపోవడం ఇలాంటివన్నీ పిల్లల మస్తిష్కంలో చెదరకుండా ఉండిపోతాయి. వారు గందరగోళానికి, అయోమయ పరిస్థితికి గురి అవుతారు. ఏమి చెయ్యాలో ఏమి చెయ్యకూడదో అర్థంకాక తర్జన భర్జనలో పడిపోతారు. అసలే ఎదిగే వయసు తమ గురించే తమకు తెలియని పరిస్థితి. అందంగా, ఆకర్షవంతంగా కంటికి కనిపించే దృశ్యాలు. ఏవి మంచివో, ఏవి చెడో, ఏవి నీళ్లో, ఏవి ఎండమావులో తెలియని అమాయకత్వం ఉంటుంది. అటువంటప్పుడు తల్లిదండ్రుల జీవితాలు, వారి మాటలే వారికి మొట్టమొదటి ఊతమవుతాయి. కనుక తల్లిదండ్రుల జీవితాలు ఇలా బ్రతుకు, మాలా జీవితం గడుపు అనే మార్గదర్శకత్వంగా ఉండాలి. అయోమయ పరిస్థితికి గురిచేసేలా ఉండకూడదు.

మొట్టమొదట తల్లిదండ్రులు తమ పిల్లలను గౌరవించాలి. వారి మనసును నొప్పించే మాటలుగాని, పనులు గాని చెయ్యకూడదు. ఇతరుల ముందు వారి గురించి మంచిగా ప్రస్తావించాలి. వారి మంచి పనులు ప్రస్తావించాలి. మానసిక నిపుణులు ఏమంటున్నారంటే, తల్లిదండ్రులు వారికి క్రమశిక్షణ నేర్పే క్రమంలో దూషించటం, ఇతరుల ముందు అవమానించటం, చెడు పదాలతో వారిని సంబోధించడం వంటివి పిల్లల మస్తిష్కంలో ఒక చిత్రం మాదిరిగా పదిలమైపోతాయి. ఆ చిత్రపటం వారి గురించి, ఇతరులు మాట్లాడుకునే మాటల ఫలితంగా ఏర్పడినదై ఉంటుంది. పిల్లల గురించి ఇతరులు మాట్లాడుకునే మాటలు చిత్రకారుడు చిత్రాన్ని వేసే కుంచె అని అనుకోండి. పిల్లల గురించి మాట్లాడేవారు చిత్రకారుడు అనుకోండి. పిల్లల గురించి మాట్లాడేవాడు ఒకవేళ నల్ల రంగును వాడినట్లయితే అంటే హేళన చేస్తూ మాట్లాడినట్లయితే నల్ల చిత్రం ఉనికిలోకి వస్తుంది. ఒకవేళ పిల్లలను గురించి మాట్లాడేవాడు కొన్ని రంగులను వాడి రంగురంగుల చిత్రాన్ని వేసినట్లయితే అది ఒక అందమైన చిత్రంగా, ఆకర్షవంతమైన చిత్రంగా ఉనికిలోకి వస్తుంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులిద్దరూ జ్ఞాపకం ఉంచుకోవాలి. తండ్రి తన కొడుకుతో మాట్లాడుతున్నప్పుడు ఏదో తన పెద్దరికాన్ని ప్రదర్శిస్తూ కొడుకు వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ మాట్లాడకూడదు. ఇది క్రమశిక్షణ అనుకోవటం పొరపాటు. దీనిద్వారా అతని వ్యక్తిత్వం వికాసం చెందదు. ప్రేమగానూ, మార్గదర్శిగానూ, స్నేహితునిగాను మాట్లాడాలి. తండ్రి ఉండగా అతనికి మరొక రహస్య స్నేహితుని అవసరం ఏర్పడకూడదు. అదేవిధంగా తల్లి తన కూతురితో మాట్లాడుతున్నప్పుడు కూడా ఈ విషయాలను తప్పకుండా జ్ఞాపకముంచుకోవాలి. తల్లి కూడా తన కూతురికి రహస్య స్నేహితురాలి మాదిరిగా ఉండాలి. అప్పుడు పిల్లలు తమ భావాలను తల్లిదండ్రులతో పంచుకుంటారు.

చివరిగా చెప్పేదేమిటంటే, సమాజానికి ఉత్తమ పౌరులుగా తమ సంతానాన్ని ఇవ్వదలచుకుంటే తమకు పిల్లలు పుట్టబోయే మరుక్షణం నుంచే తల్లిదండ్రులు వారి కోసం సిద్ధమైపోవాలి. తమ సుఖసంతోషాలన్నీ వారి చుట్టే పరిభ్రమించేలా తీర్చిదిద్దుకోవాలి. తాము వారి కోసం ఒక మోడల్ అనే విషయాన్ని మరిచిపోకూడదు. పిల్లలను ఏనాడూ తమకు అడ్డంకిగా భావించకూడదు. సాధారణంగా సమాజంలో సంతాన భవిష్యత్తు కోసం వారికి సుఖమయ జీవితం ప్రసాదించడానికి తల్లిదండ్రులిద్దరూ కష్టపడి ధనాన్ని సంపాదించి కూడబెట్టి ఉంచుతారు. ధనం ఒక అవసరం మాత్రమే కాని అంతకంటే అధిక అవసరం పిల్లలకు క్రమశిక్షణ నేర్పటం. నైతిక విలువలను నూరిపోయటం. ఇది అసలైన బాధ్యత. ఒకవేళ తమ పిల్లలను కోటీశ్వరులను చేసేసినా వారిలో సత్ప్రవర్తన గనక లేకపోయినట్లయితే వారు ఇటు తల్లిదండ్రుల కోసం, అటు సమాజం కోసం మోయలేని భారమైపోతారు.



# టెక్నాలజీ యుగంలో నైతిక విలువలు ?

**- పద్మ**

**మంచి – చెడు ఈ రెండే దారులు**
**మన ముందు స్పష్టంగా ఉన్నప్పుడు**
**మంచి మనం ఎంచుకునే మార్గమైతే ,**
**మంచి మనం ఆలోచించే ధోరణైతే,**
**మంచి మనం ఆచరించే తీరయితే..**
అదే గొప్ప నైతికత.

అయితే ఇలాంటి విలువల మార్పులు, చేర్పుల చర్చ ఎప్పుడూ మహిళల చుట్టూనే తిరుగుతుంటుందనే విషయం కూడా మనం ఇక్కడ గట్టిగా గుర్తుపెట్టుకోవాలి. అసలు నైతిక విలువలు అనగానే స్త్రీల చుట్టూ ఆలోచన కేంద్రీకృతమవుతుంది చాలా మందికి. ఎందుకంటే, నైతిక విలువలు పాటించి, వాటిని భుజాన మోసే బాధ్యత మహిళలదే అనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది.

మంచి మాట, మంచి ఆలోచన, మంచి ఆచరణే మౌలికంగా నైతిక విలువలకు ప్రాతిపదిక.

కాకపోతే చాలా సార్లు మన సమాజంలో ఈ నైతిక విలువల చర్చలన్నీ మహిళల చుట్టూనే చేస్తుంటారు. అదే అసలైన విషాదం. నైతిక విలువల్లో మార్పులు వచ్చాయి కాబట్టి, మహిళలు స్వేచ్ఛ, సమానత్వంలో బతికేస్తున్నారనుకుంటే పొరపాటే. మారిన సమాజ అవసరాలకు అనుగుణంగా, అనేక వెసులుబాట్లు, సమానత్వాలు, స్వేచ్ఛలు మహిళలకు ఇస్తున్నట్టుగా ఉంటుంది. కానీ అంతిమంగా కొత్త రూపంలో కొత్త పద్ధతుల్లో విలువల చట్రాలు మారతాయంతే.

తల్లి కడుపులో ఉన్న బిడ్డ ఆడపిల్లా అని తెలిస్తే, ఆ బిడ్డను కడుపులోనే చంపినా, లేక పుట్టిన తరువాత చంపినా చాలా సమూహాల్లో ఆమోద ముద్ర ఉంది. అది చదువుకున్న కుటుంబం, చదువుకోని కుటుంబం, పల్లెలో ఉన్న కుటుంబం, పట్టణాల్లో ఉన్న కుటుంబం అనే తేడా లేకుండా అంగీకరించే పరిస్థితి ఉంది.

ఇలాంటి పరిస్థితుల్లో ఆడపిల్లలు మగపిల్లలతో సమానంగా పుట్టే

అవకాశమే లేదు. అందుకే 2024 నాటి లెక్కల ప్రకారం మన దేశ జనాభాలో పురుషులు 51.6 శాతమయితే, మహిళలు కేవలం 48.8 శాతమేనని తేలింది. ఆడపిల్లల భ్రూణహత్యలకు కారణం కూడా నైతిక ప్రమాణాల పతనమే అని తెలుసుకోవాలి.

ఇలాంటి సమాజంలో మెజార్టీ ఆడపిల్లలు, మహిళలు విలువల చట్రంలోనే బతకాల్సి ఉంటుంది.

ఆదిమ సమాజం మాతృస్వామ్య వ్యవస్థ నుండి పితృస్వామ్య వ్యవస్థకి మారే క్రమంలో మహిళలను ఒక చరాస్తిగా మార్చిన పద్ధతిలోనే ఒక వివక్ష ఉంది. అక్కడ మొదలైన ఆ వివక్ష, ఆధునిక యుగంలో కొత్త రూపంలోకి మారింది, అది కొన సాగుతూ ఉంది.

స్త్రీ పురుషుల మధ్య సమానత్వానికి చోటు లేనప్పుడు, ఒకరు ఆధిపత్య స్థానంలో, మరొకరు అణచివేతకు గురయ్యే స్థానంలో ఉన్నప్పుడు, ఆధిపత్యంలో ఉన్నవారు తప్పకుండా తన స్థానాన్ని పదిలంగా ఉంచుకోవడం కోసం అనేక సామాజిక నియమాలు రూపొందిస్తారు. అందులో నైతిక విలువలు, కట్టుబొట్టు నుండి మొదలుపెట్టి, పెళ్లి పిల్లల పెంపకం దాకా, అనేక సూత్రీకరణలు చేసేస్తారు.

అందుకు కులం, మతం, దైవం అన్నింటినీ ఆపాదించి, మహిళలు (అందరూ కాకపోయినా) కూడా అంగీకరించే స్థితికి తీసుకొస్తారు. ఇదే పురుషాధిపత్యానికి ఉన్న బలం. అందుకే చాలా సార్లు నైతిక విలువల గురించి చర్చ జరిగినప్పుడో, లేదా ఘర్షణలు చెలరేగుతున్నప్పుడో, ఈ పురుషాధిపత్య ప్రపంచం మగవారిని కాకుండా, తెలివిగా ఆడవారిని ముందుకు తీసుకొచ్చి మాట్లాడిస్తూ ఉంటుంది. నైతిక విలువలను ఆచరించని ఆడవారిని ఆడవారే తప్పుపట్టేలా చేస్తుంది. లేదా వివిధ మతపెద్దలను తెర ముందుకు తీసుకొచ్చి మాట్లాడిస్తూ ఉంటారు.

మహిళలు కూడా శ్రమపడుతూ, జాతీయోత్పత్తిలో, కుటుంబ బాధ్యతలో సమాన భాగస్వాములుగా ఉన్న దశలో విలువలతో అడ్డుగోడలు కట్టాలని చూడటం, ఆంక్షల చట్రంలో బంధించాలని చూడటం అన్యాయమే కాదు, అభివృద్ధిని అడ్డుకోవడం కూడా.

పిల్లలు, తల్లులు పోషకాహారలేమితో బాధపడుతూనే ఉన్నారు.

స్కూల్స్‌లో ఈ రోజుకీ ఆడపిల్లల డ్రాపవుట్స్ సంఖ్య అధికంగానే ఉంది.

అనేక చోట్ల కనీస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేక ఇంట్లోనే ప్రసవాలు చేసుకుంటున్న గ్రామీణ స్త్రీలు ఎందరో ఉన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే, అనేక ప్రతికూలతల మధ్యే మహిళలు బ్రతుకుతున్నారు.

ఒక పక్క సునీతా విలియమ్స్ లాంటి వారు ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నా, అంతరిక్ష రహస్యాలను ఛేదించేందుకు సిద్ధమవుతుంటే, మరో పక్క కుటుంబాలను, కుటుంబ విలువలను కాపాడాల్సిన బాధ్యత మహిళలదే అనే సమూహాలతో కలిసి సహజీవనం చేస్తున్నాం.

భర్త భార్యను హింసిస్తే సాధారణమైన వార్త.

భార్య భర్తను హింసిస్తే సెన్సెషనల్ వార్త.

భర్త, భార్య పిల్లలను వదిలేసి వెళ్లిపోతే సాధారణమైన వార్త.

భార్య, భర్తాపిల్లలను వదిలేస్తే ఆమె కఠినాత్మురాలు.

ఇదంతా వ్యవస్థలోని లోపాలే. పుట్టినప్పటినుండి మగపిల్లలకు కొన్ని వెసులుబాట్లు ఉంటాయనే భావజాలాన్ని ఎక్కించడమే అందుకు కారణం. ఈ ధోరణి మారాలి.

విలువలకు కొత్త అర్థాలు అందరికీ చెప్పాలి. వీటిని ఆచరించాల్సిన బాధ్యత స్త్రీ పురుషులిద్దరికీ సమానంగా ఉంటుందని తెలియచేయాలి.

పిల్లలను ప్రేమించడం,
పెద్దల పట్ల బాధ్యతగా ఉండటం
స్త్రీలను సమానంగా చూడటం
శ్రమను గౌరవించడం,
మట్టిని కాపాడుకోవడం
ప్రకృతిని ప్రేమించడం,
నీటి వనరులు కాలుష్యం కాకుండా చూసుకోవడం
కాలుష్యాన్ని నివారించడం
అవినీతికి పాల్పడకుండా ఉండటం
నేరాలు చేయకుండా ఉండటం

ఇవన్నీ సాంకేతిక యుగంలోనూ అందరం ఆచరించాల్సిన విలువలుగా మారాలి. ✤

### భారత దేశంలో మొదటి మహిళా సైన్స్ ఫిక్షన్ రచయిత్రి

# రుఖయ్యా ఖాతూన్

- ముహమ్మద్ అస్గర్ అలీ



**20 వ శతాబ్దం ప్రారంభంలో (1880) బెంగాల్‌లోని రంగపూర్‌లో ఒక సంపన్న ముస్లిం కుటుంబంలో జన్మించి, బేగం రుఖయ్యాగా పేరుగాంచిన రుఖయ్యా ఖాతూన్ (వివాహానంతరం బేగం రుఖయ్యా షెఖావత్ హుస్సేన్) ప్రముఖ స్త్రీవాది, సామాజిక కార్యకర్త. వివాహానంతరం భర్త ప్రేరణతో బెంగాలిలో రచనలు సాగించిన ఆమె తన రచనలలో స్త్రీ–పురుష సమానత్వంను, పలు సామాజిక అంశాలను ప్రస్తావించారు.**

భర్త తోడ్పాటుతో ప్రారంభించిన ముస్లిం బాలికల విద్యాలయం నేటికీ కలకత్తాలో కొనసాగుతున్నది. రుఖయ్యా ఖాతూన్ స్థాపించిన "అంజుమన్ యె ఖవాతీన్ యె ఇస్లాం" అనే సంస్థ అనేక సాంఘిక సంస్కరణల కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆమె తన రచనల ద్వారా అన్యాయం, సాంఘిక అసమానతలు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడమని స్త్రీలను ప్రోత్సహించారు. ఇస్లాంలో స్త్రీ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని చెప్పేవారు.

రుఖయ్యా ఖాతూన్ అనేక రచనలు చేశారు. వీటిలో sultana's dream (సుల్తానా స్వప్నం), పద్మరాగ్ ముఖ్యమైనవి. 'పిపాసా' రుఖయ్యా ఖాతూన్ తొలి రచన. ఆమె రాసిన "సుల్తానా స్వప్నం" (sultana's dream)" 1905లో మద్రాస్ నుండి వెలువడే "ది ఇండియన్ లేడిస్ మేగజైన్"లో అచ్చయ్యింది. ఇప్పటికీ ఈ కథ లభ్యమవుతుంది. ఇది భారతదేశంలో ఒక మహిళ రచించిన తొలి సైన్స్ ఫిక్షన్ అని చెప్పవచ్చును.

రుఖయ్యా ఖాతూన్ "సుల్తానా స్వప్నం"(sultana's dream)లో భవిష్యత్‌ను స్త్రీ దృక్పథం తో చిత్రీకరించింది. రాబోయే తరాలు వాడుకునే ఉపకరణాలను రాబోయే ఆవిష్కరణలను ఆనాడే తన రచన "సుల్తానా స్వప్నం " లో పేర్కొన్న రచయిత్రిగా రుఖయ్యా ఖాతూన్ పేరుపొందారు.

సోలార్ పవర్ (సూర్య శక్తి) ఉపయోగం గురించి ఆనాడే ఊహించి తన రచనలో సోలార్ కిచన్‌ను వర్ణించారు. సోలార్ శక్తితో పని చేసే వంటిల్లును తన రచన "సుల్తాన స్వప్నం"లో వర్ణించారు.

ఇంకొక అడుగు ముందుకు వేసి ఆనాడే గాలితో పని చేసే ఎయిర్ – కార్‌ను తన రచనలో వర్ణించారు. హైడ్రోజన్ సహాయంతో భూమి గురుత్వాకర్షణ శక్తిని దాటి పంఖాల సహాయంతో గాలిలో ఎగిరే ఎయిర్ కార్ గురించి రాశారు. అందమైన ల్యాండ్ స్కేప్, పూలతోటలు, పచ్చిక మైదానాలు, వెల్వెట్ కార్పెట్ వంటి పచ్చికతో కూడిన అందమైన పబ్లిక్ పార్కులను తన రచనలలో వర్ణించారు. అదేవిధంగా స్త్రీ లందరూ విధిగా చదువుకోవాలని, స్త్రీ వివాహానికి కనీస వయసు 21 సంవత్సరాలుండాలనే సాంఘిక సంస్కరణలను ఆమె

# మంచి మాటలు...! స్వర్గానికి బాటలు...!

**ముహమ్మద్ వహీదుద్దీన్**

మానవులకు అల్లాహ్ ప్రసాదించిన వరాలు అనంతం. వాటిని ఊహించడం గాని, వర్ణించడం గాని అసాధ్యం. అటువంటి అసంఖ్యాక అనుగ్రహాల్లో మాట కూడా ఒకటి. సంభాషణ, మానవుల మధ్య పరస్పర సంబంధాలకు వారధి. దీని వినియోగంపైనే మనిషి సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయి. దీన్ని సద్వినియోగం చేసుకుంటే అమృతపు జల్లు జాలువారుతుంది. మంచిని పెంచి మనిషి గౌరవ మర్యాద లను ఇనుమడింపజేస్తుంది. సంఘంలో ఉన్నత స్థానంలో కూర్చో బెడుతుంది. శాంతి సామరస్యాలను వెదజల్లుతుంది.

మాటను దుర్వినియోగం చేస్తే విద్వేషం పెచ్చరిల్లుతుంది. అశాంతి ఏర్పడుతుంది. సమాజంలో స్థాయిని దిగజార్చుతుంది. ఇహ పరాల్లో ఆపదలు తెచ్చిపెడుతుంది. వైఫల్యాలకు కారణం అవు తుంది. అల్లాహ్ దృష్టిలో నోటి దురుసు దుర్భాష అశ్లీలం తీవ్రమైన నేరాలు. దీనికి ఇహలోకంలో పరాభవం, పరలోకంలో నరక శిక్ష అనుభవించవలసి ఉంటుంది.

అంతిమ మహా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు:

ప్రళయదినాన విశ్వాసి త్రాసులో తూచబడే అత్యంత విలువైన, బరువైన వస్తువు మానవుని సత్ప్రవర్తనే. అశ్లీల మాటలు పలికే వారిని, దుర్భాషలాడే వారిని అల్లాహ్ అసహ్యించుకుంటాడు.

కొంతమంది పైకి ఎంతో భక్తిపరులుగా కనిపిస్తారు. కానీ తమ నోటితో ఇతరుల్ని ఇబ్బంది పెడుతుంటారు. పరుల మనసు గాయపరుస్తుంటారు. అలాంటి వారి గురించి దైవ ప్రవక్త(స) ఇలా అన్నారు:

ఒక స్త్రీ ఎన్నో నఫిల్ నమాజులు చేస్తుంది. మరెన్నో నఫిల్ ఉపవాసాలు పాటిస్తుంది. పెద్ద ఎత్తున దానధర్మాలు చేస్తూ ఉంటుంది. ఆమె గొప్ప దాతగా ప్రసిద్ధి చెందింది. కానీ ఆమెకు నోటి దురుసు ఎక్కువ. ఏదో ఒకటి అని పొరుగువారి మనసు బాధ పెడుతూ ఉంటుంది అని ప్రవక్త(స)కు ఒక వ్యక్తి నివేదించాడు. అయితే ఆమె నరకానికి పోతుందని చెప్పారు.

మరో స్త్రీ నఫిల్ నమాజులు, నఫిల్ రోజాలు పాటించడం చాలా అరుదు. దానధర్మాలు చేయడం కూడా తక్కువే. ఉన్నంత లోనే అప్పుడప్పుడు కొన్ని జున్ను ముక్కలు దానం చేస్తూ ఉంటుంది. అయితే ఆమె ఎప్పుడూ ఇరుగుపొరుగు వారిని పల్లెత్తు మాట అనదు. వారి మనసు నొప్పించదు. అందరినీ చిరు నవ్వుతో పలకరిస్తుంది. ఆమెకు స్వర్గవాసి అని దైవ ప్రవక్త(స) సెలవిచ్చారు.

అందుకే దేహంలోని అవయవాలన్నీ ఉదయం లేవగానే నాలుకతో మొర పెట్టుకుంటాయట. తల్లీ! నువ్వు కాస్త జాగ్రత్తగా ఉండు. దైవానికి భయపడుతూ ఉండు. నువ్వు చల్లగా ఉంటే మేము చల్లగా ఉంటాము. నువ్వు ఏమాత్రం తూలావో మేమంతా హూనమై పోతామని అంటాయట.

అందుకని నరం లేని ఈ నాలుక విషయంలో దైవానికి భయ పడుతూ ఆచితూచి ప్రయోజనకరమైన మాటలనే పలకాలి. పరుషంగా మాట్లాడకూడదు.

ఉపయోగం లేని మాటల కన్నా మౌనమే మిన్న. లేకపోతే అనర్థాలు జరిగిపోతాయి. దైవానికి సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది.

---

ఆనాడే ఊహించారు. వాటర్ బెలూన్‌ల ద్వారా మేఘమథనం చేసి నీటిని పొందడం, సౌర శక్తిని వాణిజ్య, సైనిక, గృహ అవసరాలకు వినియోగించటం గురించి కూడా తన రచనలో పేర్కొన్నారు.

వ్యవసాయాన్ని యాంత్రీకరించడం, విద్యుత్ శక్తి సహాయంతో బావుల నుంచి నీటిని తోడడం, ప్రయాణ సాధనంగా విమాన యానం లాంటి విషయాలను తన రచనల్లో ప్రస్తావించారు. ట్రాఫిక్ జామ్ వంటి సమస్యలను ఆనాడే తన రచనల్లో రాశారు.

ఆమె రచనలలో ఆహార పదార్థాలుగా పల్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రదేశాలను చల్లబరుచుటకు కృత్రిమమైన వాటర్ ఫాల్స్, సూర్య శక్తితో పని చేసే రూమ్ హీటర్స్/వాటర్ హీటర్స్ అన్నీ ఆనాడే ఊహించి రాశారు.

సైన్స్ పరిశోధనలకు ఉపయోగించే యూనివర్సిటీలు, సైన్స్ లాబ్స్, అంతరిక్ష పరిశోధనలకు ఉపయోగపడే అబ్జర్వేటరీలు అన్నింటి ప్రస్తావన బేగం రచనల్లో కనిపిస్తుంది.

దాదాపు 110 సంవత్సరాలకు పూర్వమే ఆధునిక ఆవిష్కరణలను తన రచనలలో ప్రస్తావించి, సైన్స్ ఆవిష్కరణల పట్ల ఆసక్తి చూపిన పురోగామి మహిళ రుఖయ్యా. అరబీ, ఫార్సీ భాషలను అభ్యసించిన సనాతన ముస్లిం జమిందారీ కుటుంబంలో జన్మించినప్పటికీ ఆధునిక విద్యనూ అభ్యసించి, బెంగాలి నేర్చుకొని ఇంగ్లీష్‌లో సైన్స్ ఫిక్షన్ రచనలు చేసిన తొలి భారతీయ మహిళగా బేగం రుఖయ్యాను పేర్కొనవచ్చును. ✤

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

62 – 65 షైతాన్ మిమ్మల్ని దాన్నుండి ఆపివేస్తాడో ఏమో,[56] అలా జరగరాదు, వాడు మీకు బద్ధశత్రువు. మరి ఈసా ప్రస్ఫుటమయిన సూచనలు తీసుకుని వచ్చినప్పుడు అతను ఇలా అన్నాడు, "నేను మీ వద్దకు విజ్ఞతను తీసుకువచ్చాను. మీరు విభేదించుకుంటూవున్న కొన్ని విషయాల వాస్తవికతను విడమర్చి చెప్పడానికి వచ్చాను. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి, నా విధేయతను పాటించండి. యదార్థం ఏమిటంటే అల్లాహ్ మాత్రమే నాకూ ప్రభువు, మీకూ ప్రభువు. ఆయన్నే మీరు ఆరాధించండి, ఇదే రుజుమార్గం."[57] కాని (అతను ఈ స్పష్టమయిన బోధన అందజేసినప్పటికీ) ఆ వర్గాలు పరస్పరం విభేదించుకున్నాయి.[58] కాగా, ఎవరయితే అత్యాచారం జరిపారో ఆ జనులకు ఒక వ్యధాభరితమయిన దినం నాటి యాతన ద్వారా వినాశం తప్పదు.

66–78 ఇక వీరు కేవలం ఈ ఒక్క విషయానికే నిరీక్షిస్తున్నారా – అకస్మాత్తుగా వీరి పైకి ప్రళయం వచ్చెయ్యాలనీ, అదీ వీరికి ముందుగా తెలియకుండా జరగాలనీ? ఆ రోజు వచ్చేసినప్పుడు ధర్మనిష్ఠ గలవారు తప్ప మిగతా మిత్రులందరూ ఒకరికొకరు శత్రువులయి పోతారు.[59] ఆ రోజున మా ఆయత్‌లను విశ్వసించి, ఆజ్ఞాబద్ధులయి జీవించిన వారికి ఈ విధంగా చెప్పడం జరుగుతుంది, "నా దాసులారా, నేడు మీకు ఎటువంటి భయం అక్కర లేదు, మీకు ఎటువంటి దుఃఖమూ కలగదు. ప్రవేశించండి స్వర్గంలోకి, మీరూ మీ సతీమణులూ,[60] మిమ్మల్ని సంతుష్టపరచడం జరుగుతుంది."

56. అంటే, ప్రళయం పట్ల విశ్వసించకుండా ఆపివేస్తాడో ఏమో.

57. అంటే, ఈసా (అ) ఎన్నడూ అనలేదు, నేను దేవుణ్ణి అనీ లేదా దేవుని కుమారుడినని, మీరు నన్ను ఆరాధించండి అనీను. నిజానికి ఆయన సందేశం కూడా ఇతర ప్రవక్తలందరి సందేశమే. దాని వైపునకే మహనీయ ముహమ్మద్ (స) సయితమూ మిమ్మల్ని పిలుస్తున్నారు. (వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం. 1, ఆలి ఇమ్రాన్: పాద సూచికలు 45–48, 54 సం. 2, అన్‌నిసా: పాదసూచికలు 212, 213, ఆయత్‌లు 172, 173 అల్ మాఇద: పాద సూచికలు 100, 130 సం. 4, మర్యమ్: పాద సూచికలు 21 – 23).

58. అంటే, ఒక వరమయితే ఆయన్ని తిరస్కరించి ఆ వ్యతిరేకతలో ఆయన అధర్మ జననం అన్న అపనిందమోపేంత వరకు వెళ్ళింది, ఆయన్ని తమ దృష్టిలో శిలువ నెక్కించే తీరింది. మరో వర్గమయితే ఆయన్ని నమ్మి ఆయన నమ్మకంలో అంతులేని అతిశయానికి పోయి ఆయన్ని దేవుని కుమారునిగా చేసివేసింది. ఒక మానవుడు దైవంగా రూపొందడం అనే విషయం ఆ వర్గం కొరకు కొరకరాని కొయ్యగా మారింది. దాన్ని పరిష్కరిస్తూ పరిష్కరిస్తూ ఆ వర్గంలో అసంఖ్యాకమయిన ముఠాలు ఏర్పడ్డాయి. (వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం. 2, అన్ నిసా: పాదసూచికలు 211–216 అల్ మాఇద: పాదసూచికలు 39, 40, 101, 130).

59. మరోమాటలో చెప్పాలంటే కేవలం కొన్ని మైత్రీలు మిగిలి పోతాయి, అవి ప్రపంచంలో సదాచారం, దైవభక్తి ఆధారంగా ఏర్పడ్డవి మాత్రమే. ఇతర సమస్త మైత్రీ భావాలు శత్రుత్వాలుగా మారిపోతాయి. నేడు అపమార్గంలో, అన్యాయం, అత్యాచారాలలో, అపరాధాలలో ఒకరికొకరు సన్నిహిత మిత్రులు, సహచరులు అయిన వారంతా రేపు ప్రళయదినాన పరస్పరం ఒకరిపై నొకరు నిందలు మోపుకుంటూ తమను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తూ కానవస్తారు. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో మాటిమాటికీ పలుచోట్ల ప్రస్తావించబడింది– దీనివల్ల ప్రతి వ్యక్తి ప్రపంచంలోనే బాగా ఆలోచించుకోవాలని, ఎవరికి తోడ్పాటు ఇవ్వడం తనకు ప్రయోజనకరమో, ఎవరికి సహకరించడం తనకు వినాశకరమో తెల్చుకోవాలని.

60. మూలంలో **"అజ్వాజ్"** అనే పదప్రయోగం జరిగింది. అది భార్యలకూ ప్రయోగించబడుతుంది, ఒక వ్యక్తికి సహాభిరుచిగల వారికి, సహచరులయిన వారికి, సహపాఠులయినవారికీ ప్రయోగించబడుతుంది. ఈ విస్తృతార్థం గల పదం ఈ కారణంగానే ప్రయోగించబడింది, దీని భావంలో ఉభయ వర్గాలూ చేరిపోవాలని. విశ్వసించేవారి విశ్వాసులయిన భార్యలూ వారికి తోడుగా ఉంటారు, వారి విశ్వాసులయిన మిత్రులు సయితం వారికి స్వర్గంలో సహచరులయి ఉంటారు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం

**(కితాబుల్ మగాజీ)**

**617)** అబ్దుల్లాహ్ బిన్ ఖబ్బాబ్(రజి)కథనం: అబూ సయీద్ బిన్ మాలిక్ ఖుద్రీ (రజి) ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు ఆయన ఇంటివారు ఆయన ముందు ఖుర్బానీ మాంసాన్ని సమర్పించారు. దానిపై ఆయన, "దీనికి సంబంధించిన ఆజ్ఞ ఏమిటో స్పష్టంగా తెలియనంతవరకూ నేను దీనిని తినను" అని నిర్దిష్టంగా చెప్పేశారు. చివరకు ఆయన తన తల్లి తరపు (సవతి) సోదరుని వద్దకు సందేహ నివృత్తి కొరకు వెళ్ళారు. ఆయన పేరు ఖతాదా బిన్ నోమాన్ అన్సారీ(రజి). ఆయన బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారిలో ఒకరు.[1] ఆయన ఇలా అన్నారు: "మూడు రోజుల కన్నా ఎక్కువగా ఖుర్బానీ మాంసాన్ని నిల్వ ఉంచరాదన్న ఆజ్ఞ నీవు ప్రయాణానికి వెళ్ళిన తరువాత రద్దు అయింది."

**621)** రబీ బిన్తె మవూజ్(ర.అ) ఖాలిద్ బిన్ జక్వాన్‌తో ఇలా అన్నారు: నా వివాహం జరిగిన నాటి రాత్రి-తెల్లవారాక ప్రవక్త మహనీయులు(సఅసమ్) నా ఇంటికి వచ్చి, నా పడకపై కూర్చున్నారు. ఇప్పుడు నీవు నా దగ్గర కూర్చున్నట్లుగానే కూర్చున్నారు. ఆ సమయంలో కొంతమంది బాలికలు డప్పు వాయిస్తూ బద్ర్ యుద్ధంలో వీరమరణం పొందిన తమ కుటుంబీకుల గురించి గీతాలాపన చేసుకుంటున్నారు. అప్పుడు వారిలోని ఒక బాలిక 'మన మధ్యన ఒక ప్రవక్త(స) ఉన్నారు. రేపు ఏం జరగనున్నదో ఆయనకు తెలుసు'[1] అన్న కవిత చెప్పింది. దైవ ప్రవక్త(స) వెంటనే ఆ అమ్మాయిలను వారిస్తూ, "ఇలా అనవద్దమ్మా. ఇంతకు ముందు మీరు పాడుకున్నవే పాడుకోండి" అని బోధించారు.

**637)** బనీ జుహ్రాతో మైత్రి కలిగి ఉన్న మిఖ్దాద్ బిన్ అమ్ర్ కిందీ బద్ర్ యుద్ధంలో దైవప్రవక్త(స)తో కలసి పాల్గొన్నారు. ఆయన ఇలా వివరించారు- 'దైవప్రవక్తా! చెప్పండి, నేను (యుద్ధంలో) ఒక అవిశ్వాసితో తలపడతాను. ఇద్దరం పోరాటం సాగిస్తాము. ఆ అవిశ్వాసి తన ఖడ్గంతో నా చేయి కూడా నరికేస్తాడు. ఆ తర్వాత అతను ఒక చెట్టు ఆసరాలోకెళ్ళి 'నేను ముస్లింనయ్యాను' అంటాడు. అట్టి పరిస్థితిలో (అతను కలిమాను పఠించిన మీదట) నేనతన్ని చంపగలనా?' అని నేను సందేహపడగా,"లేదు. నీవు అతన్ని చంపకూడదు" అని ఆయన(స) సెలవిచ్చారు. మిఖ్దాద్, 'దైవప్రవక్తా! అతను నా చెయ్యి ఒకదాన్ని నరికిన మీదట ఇలా అంటాడు కదా' అని విన్నవించుకోగా, "అయినా సరే, అతన్ని చంపకూడదు. ఎందుకంటే నీవు గనక అతన్ని చంపినట్లయితే, అతన్ని చంపక ముందు నీవు ఏ స్థితిలో ఉండేవాడివో ఇప్పుడు అతను ఆ స్థితిలో ఉంటాడు. కాగా; నీ స్థానం అతను కలిమా పఠించకముందు ఉండే చోట ఉంటుంది."[1]

617-1. ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఖతాదా బిన్ నోమాన్ (రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబి కాబట్టి, ఈ అధ్యాయం క్రింద ఈ హదీసును తీసుకోవటం జరిగింది.

621-1. ఈ కవిత ద్వారా దైవప్రవక్త(స)కు అగోచర జ్ఞానం ఉంది అనే విషయం ద్యోతకమవుతోంది. వాస్తవానికి ఒక్కడైన అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ అగోచర విషయాల జ్ఞానం లేదు. అందుకే దైవప్రవక్త(స) వెంటనే కల్పించుకుని, వారించారు. ఇలా అనవద్దని, ఇంతకుముందు పాడుకున్నదే పాడుకోండి అనీ నచ్చజెప్పారు. కనుక ఎవరయితే దైవప్రవక్త(స)కు అగోచర విషయాల జ్ఞానం ఉందని వాదిస్తున్నారో వారు అబద్ధీకులు. ఇది ఖుర్‌ఆన్ హదీసుల ధిక్కరణ క్రిందికి వస్తుంది.

637-1. అంటే 'ఖిసాస్' (రక్తపరిహారం) కింద ఇప్పుడు నిన్ను వధించటం సమ్మతం అవుతుంది.

★★★



# ముస్లిములు- భారత నిర్మాణంలో పాత్ర

**[1995లో హైదరాబాద్, వాదియె హుదాలో జరిగిన జమాఅతె ఇస్లామీ హింద్ అఖిల భారత సర్వసభ్య సమావేశంలో కె.సి. అబ్దుల్లాహ్ (కేరళ)గారు రాకపోవటం చేత నేను అప్పటికప్పుడు ఉర్దూలో ప్రసంగించడానికి వ్రాసుకున్న పాయింట్ల ఆధారంగా తెలుగు రూపం ఇచ్చిన వ్యాసమిది.]**

**- ఎస్.ఎమ్.మలిక్**

**ముస్లిములు-** భారత ముస్లిములే కాదు, ముస్లిములు ఎవరయినా- వారి ఉనికికి అర్థం ఏమిటి? వారు ఒక అంతర్జాతీయ సముదాయం. వారు ఒక సైద్ధాంతిక సముదాయం. వారు ఒక సందేశానికి, మానవాళి శ్రేయస్సు కొరకు సందేశానికి ధ్వజ వాహకులు. ఆ సందేశం చేతపుచ్చుకునే వారు భారతావనికి, సముద్ర యానాల ద్వారా భారత తీర ప్రాంతాలకు వచ్చారు. బ్రతుకుతెరువుగా వ్యాపారం చేసుకుంటూ వచ్చారు. అయితే సందేశం అందజేయడం వారి బ్రతుకుతెరువు కన్నా ఘనమయినది, ప్రముఖమయినది. సందేశం వారి జీవిత పరమార్థం. వారి జీవిక కొరకు వ్యాపారం ఆలంబనగా ఉన్నా వారి జీవితాశయం, సందేశం మానవాళికి చేరవేయడం తప్ప మరేమీ కాదు.

### నిజాయితీతత్పరులు

ముస్లిములు భారత తీర ప్రాంతాలకు వ్యాపార నిమిత్తం వచ్చినా వారు వ్యాపారంలో తమ నిజాయితీ, సత్యప్రియత, నికార్సయిన నడవడి వల్ల ఇక్కడి జనావళి హృదయాలను చూరగొన్నారు. వారు తమ వాణిజ్య కార్యకలాపాలు ముగించుకుని తిరిగి తమ స్వదేశాలకు వెడుతూ ఉంటే, భారత జనావళి, ప్రేమమయులయిన సోదరులు, వారి సత్ప్రవర్తనకు ముగ్ధులయిన సీదాసాదా జనం కన్నీరు కార్చసాగారు. ఈ గడ్డను వదలి వెళ్ళవద్దని వేడుకున్నారు, గట్టిగా పట్టుకున్నారు, అవసరమయితే తమ కుటుంబాలను పిలిపించుకోవాలని అభిలషించారు కాని,

వెళ్ళనివ్వలేదు. ఇంకా అవసరమయితే తమ కుటుంబాలను ఏర్పరచుకునేందుకు తమ ఇల్లూ వాకిలి మాత్రమే కాదు తమ కూతుళ్లను సయితం ఇచ్చి వివాహం చేసిపెడతామని హామీనిచ్చారు, అలాగే చేశారు కూడా. వారిని తమ 'మాపిళ్లై' (అల్లుడు గారు) అని గౌరవంగా పిలిచారు, తమలో ఒకరుగా ఆనందంగా ఆలింగనం చేసుకున్నారు.

ముస్లిములు కూడా సంతోషంగా ఆ ఆహ్వానాన్ని స్వీకరించారు. ఇక్కడ నివాసముండటమే కాదు, ఇక్కడి అనురాగ శీలురయిన జనంతో, మమకార మూర్తులయిన ప్రజతో మమేకమయిపోయారు. ఇక్కడి భాషల్ని తమవిగా సహృదయతతో స్వీకరించారు. వీరిలో ఒకరుగా సంవిలీనమయిపోయారు.

## సందేశ ప్రదానం

ముస్లిములు  ఇక్కడివారుగా, ఇక్కడి సభ్యతా సంస్కృతుల్ని ఆదరించి తమకు స్వంతం చేసుకోవడంతోపాటు, ఒక సైద్ధాంతిక సముదాయంగా, సందేశ ప్రధానమయిన సమాజంగా తమ నిజ ఆశయాన్ని మరచిపోలేదు. ఇక్కడి సమాజానికి, ఇక్కడి నాగరికత, సభ్యతా సంస్కృతులకు, సాహిత్యానికి, కళలకు, భవన నిర్మాణాలకు- ఒక్క మాటలో సాముదాయిక నిర్మాణానికి తమలోనిదంతా ధారపోశారు. ఈ రంగాలన్నింటినీ సుసంపన్నం చేశారు.  అలాగే తమ సందేశాన్నీ అందజేశారు. ఎన్నో శుభాత్మలు ఆ సందేశాన్ని ఆశ్రయించి ధన్యమయ్యాయి. దాన్ని తమ వంతుగా మేధావుల్లో, విద్యావంతుల్లో, వాణిజ్యవేత్తల్లో, కళాకారుల్లో, పరిపాలకుల్లో, జన సామాన్యంలో విస్తృతపరిచారు. తద్వారా ఇక్కడి సమాజం, సామాజిక వ్యవస్థను పటిష్టపరిచారు.

ముస్లిములు ఇక్కడి ఆలోచనా విధానానికి (thought), ఇక్కడి తాత్విక విధానానికి (Phylosophy) ప్రామాణికత (Value system) అందజేశారు. సతతం సర్వవిధాల సుసంపన్నం చేస్తూ ఉన్నారు.

## స్వతంత్రతా భావన

ఇస్లామీయ దృక్పథం ప్రకారం ప్రతి మానవుడు జన్మతః స్వేచ్ఛా జీవి.  మనిషిపై ఎటువంటి ప్రతిబంధకం లేదు, అతను సర్వవిధాలా సర్వ స్వతంత్రుడు. మతం రీత్యా, కులం రీత్యా, భాష రీత్యా ప్రాంతం రీత్యా- ఏ విధంగానూ మనిషి దేనికీ కట్టుబడి లేడు. ఎవ్వరూ, కడకు తల్లిదండ్రులు సయితం అతన్ని ఈ నిబంధనలు వేటికీ పట్టి ఉంచలేరు. పుట్టుకతోనే అతను స్వేచ్ఛతో పుట్టాడు, అందువల్ల  మరే మానవుడు కూడా అతన్ని ఏ విధమయిన ఖైదులోనూ నిర్బంధించలేడు. కులమతాలు, జాతి, సభ్యత, సంస్కృతి- అన్నింటికీ మనిషి అతీతుడు. ఏ మతాన్నయినా, ఏ భాషనయినా, ఏ ప్రాంతాన్నయినా, ఏ సభ్యత, నాగరికత, సంస్కృతినయినా అతను స్వేచ్ఛగా స్వీకరించగలడు. ఈ స్వేచ్ఛా భావన, స్వతంత్రతా భావన విశ్వజనీనమయినది, సర్వజనీనమయినది; సమగ్రమయినదీ, సంపూర్ణమయినది కూడా.

## సర్వ సమానత

ముస్లిములు ఈ స్వతంత్రతా భావాన్ని తాము అనుసరించే ధార్మిక పంథానుసరించి దాని వెలుగులోనే భారత దేశానికి అందజేశారు. అలాగే మానవుల మధ్య సమానతా భావనను సయితం తమ ధార్మిక దృక్కోణం దృష్ట్యానే దేశంలో సర్వ సామాన్యం  చేశారు. మనిషి ఏ ఇంట పుట్టినా, ఏ ప్రాంతంలో పుట్టినా, ఏ భాష మాటలాడేవారి మధ్యన పుట్టినా, ఏ రంగు, ఏ జాతి, నల్లవాడయినా, తెల్లవాడయినా, భారతీయుడయినా, యూరోపియన్ అయినా, అరబ్బు అయినా, అమెరికన్ అయినా, చైనీయుడయినా, ఆర్యుడయినా, ద్రావిడులయినా, అరబ్బు అయినా ఆఫ్రికన్ అయినా వీరంతా సమానులే- ఎందుకంటే వీరంతా ఒకే తల్లిదండ్రులయిన ఆదమ్ హవ్వాల సంతానం అన్న సమానతా భావాన్ని  పెంపొందించే ప్రయత్నం చేశారు ముస్లిములు.

## సామాజిక నైతిక మూల్యాలు

సామంజస్యత, సామరస్యత, న్యాయం, ధర్మం, సత్యప్రియత, ధైర్యసాహసాలు, నిర్భయత, సహానుభూతి, నిస్వార్థత, పరోపకారం, త్యాగం వంటి మానవీయ విలువల్ని తాము అడుగుపెట్టిన ప్రతిచోటా నిలబెట్టడానికి, పటిష్టపరచడానికి సతతం కృషి చేశారు ముస్లిములు. స్వయంగా తాము వీటిని ఆచరించి, స్వయంగా తాము వీటి ప్రతిరూపాలయి మెలిగారు.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

మారిన నేటి పరిస్థితుల్లోనూ ఈ సందేశానికి, ఈ మూల్యాలకు, ఈ భావనలకు మన సామాజిక, సామూహిక జీవితాల్లో, వ్యవస్థల్లో నెలకొల్పవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. తొలుత ముస్లిములు ఈ భావనలకు, ఈ విలువలకు, ఈ సందేశానికి తామే స్వయంగా మూర్తిత్వం వహించి సమాజంలో వాటిని ప్రవేశపెట్టడానికి, వాటిని సర్వసామాన్యం చేయడానికీ ప్రప్రథమంగా ముందుకు రావలసి ఉంది.

## మన దేశం

ఇదీ భారత ముస్లిముల స్థాయి, స్థానం, నిజరూపం, అవశ్యమయిన శీల స్వభావాలు. అయితే మన దేశం, భారతదేశ స్వరూపాన్నీ దాని గుణగణాలనూ పరిశీలించవలసి ఉంటుంది. మన దేశంలో అనేక చారిత్రక, నైసర్గిక కారణాల వల్ల అనేక సభ్యతా సంస్కృతులు, ఎన్నో మతాలు, మరెన్నో నాగరికతలు ఒకదాని ప్రక్కన మరొకటి ఆచరణాత్మకంగా దర్శనమిస్తూ ఉంటాయి.

ఈ వాతావరణంలో వెయ్యి సంవత్సరాల కన్నా అధిక చరిత్ర గల ముస్లిములూ ఉన్నారు. కాని ఈ మధ్య, వందేళ్లుగా ముస్లిములను గురించి సాధారణ జనావళిలో అసంఖ్యాకమయిన అపోహలు, అపార్థాలు దారి చేసుకున్నాయి. అనుదినం పెరుగుతూనే ఉన్నాయి. ఇంకా కొందరు దేశాన్ని ప్రేమించే వారి ముసుగుల్లో, పనిగట్టుకుని జనుల మధ్య అపార్థాలు, అపోహలు నాటి వాటిని పోషించడంతోపాటు వాటిని విస్తృతపరచడమూ జరుగుతోంది. ముస్లిములు ఈ అపోహలు, అపార్థాల నడుమనే బ్రతుకు వెళ్ళ దీస్తున్నారు. ఈ అపార్థాల కారణంగా సాధారణ జనులతో పాటు సహజీవనం సాగిస్తున్న ముస్లిములు సతతం భయాందోళనల మధ్యనే జీవిస్తున్నారన్నది వాస్తవం.

## అభద్రతా భావం

గత వందేళ్లకు పైగా ముస్లిములు ధన, మాన, ప్రాణాల రక్షణా రాహిత్య వాతావరణంలో అనేక సందర్భాలలో బిక్కుబిక్కుమంటూ భయ విహ్వళ దృక్కులతోనే, ఎప్పుడు ఏ ముప్పు వాటిల్లు తుందోనన్న ఆందోళనతోనే శ్వాస పీల్చుకుంటూ గడపవలసి వస్తోంది. కొత్తగా కాకపోయినా ఈ పరిస్థితి గత 75 ఏళ్ళలో మరీ తీక్షణ రూపం ధరించింది. అనుదినం వారి శీల స్వభావాలపైన అనుమానాల, కుశంకల బురద చల్లడం, వారి చిత్తశుద్ధిని, నిజాయితీని (Integrity) శంకించడం జరుగుతుంది. ఫలితంగా వారు హింసా దౌర్జన్యాలకు గురయ్యే ప్రమాదాలు ముందుకు వస్తున్నాయి. వారి పట్ల అసమంజసమయిన, అసందర్భమయిన దురభిప్రాయాలు వ్యక్తం చేసి వారి ఉనికికే ఎసరుపెట్టే వాతావరణం సృష్టించడం జరుగుతోంది.

## మత పరంగానూ....

వారి మతం, ధార్మిక స్థలాలు, ధార్మిక గ్రంథం, ధార్మిక వ్యక్తిత్వాలు- సర్వం జుగుప్సాకరమయిన దాడులకు గురవడం సాధారణ మయిపోయింది. ఇదంతా ఒక ఎత్తయితే భారత స్వాతంత్ర్యం తరువాత ముస్లిములు ఎన్నో విధాలుగా, సామాజిక, ఆర్థిక ఇబ్బందుల్ని సయితం ఎదుర్కోవలసి వస్తోంది. ఇంకా విద్యా విషయికంగానూ, బ్రతుకుతెరువు దృష్ట్యాను అనూహ్యమయిన చిక్కుల్ని, కాఠిన్యాలనూ చవిచూడవలసి వస్తోంది.

ఈ పూర్వరంగంలో ముస్లిముల బాధ్యతలు ద్విగుణీకృతమయి పోతాయి. ఒక ప్రక్కన వారు తమ ఉనికిని నిలుపుకుంటూ జీవిక నిరంతర కృషిలో నిమగ్నులయి మరో ప్రక్కన తమపైన ముసురుకున్న అపార్థాలు, అపోహల అంధకారాలను దూరం చెయ్యడానికి శాయశక్తులా ప్రయత్నాలు ముమ్మరం చేయవలసి ఉంది. ఇదంతా చెయ్యడం చెప్పినంత సులువు కాదు. కాని సాధించడం తప్ప గత్యంతరం లేదు.

## సంస్కరణ

నిజం ఏమిటంటే, ముస్లిములు చాలా కాలంగా, వ్యక్తిగత స్థాయిలోనూ, సాముదాయిక స్థాయిలోనూ, ఏ విధమయిన సంస్కరణ, సముద్ధరణ కార్యక్రమానికి నోచుకోలేకపోయారు. దానికి కారణాలు ఏవయినా అది మాత్రం కాదనలేని యథార్థం. అందువల్ల వారిలో అనేకమయిన ధార్మిక, నైతిక, సామాజిక రుగ్మతలు చోటు చేసుకున్నాయి. తత్కారణంగా వారి మధ్య సంస్కరణ, సముద్ధరణా కార్యక్రమం నెరపవలసిన అవసరం ఎంతయినా ఉంది. నైతిక, ధార్మిక, సామాజిక సంస్కరణలే కాక వారిని ఇతర కోణాలలోనూ సముద్ధరించవలసి ఉంటుంది. విద్యాభ్యాసం రీత్యా, ఆర్థిక సమున్నతి రీత్యా, మానవ హక్కుల స్పృహ దృష్ట్యా కూడా వారిలో జాగృతి తీసుకురావలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

## చితికిపోయిన కంఠం

వారు సామాజికంగా బాగా చితికిపోయిన దృష్ట్యా వారి ఘోషను పరిపాలనా వ్యవస్థ అయినా, సామాజిక సంస్థలయినా పెడచెవిన పెట్టడం సర్వసాధారణమయిపోయింది. కడకు, అతి బలహీన మయిన కంఠం, దళితులు, వెనుకబడిన వారు సయితం లేవనెత్తిన కంఠాల్ని సయితం అతిపెద్ద ఎత్తున ప్రపంచానికి ఎత్తిచూపే మీడియా కూడా ముస్లిముల రోదనల్ని పట్టించు

కోకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. వారు మరీ ఉచ్ఛ స్వరంలో గొంతు చించుకుంటే, దేశంలోని పర్వతాలు, నదీనదాలు సయితం ప్రకంపనలకు గురయిన దశలో అందరి కళ్ళు తెరచుకుంటాయి. ఉదాహరణకు-

నెల్లి (అస్సోము), బాబరీ మస్జిద్ కూల్చివేత, గుజరాత్‌లో మానవ సంహారం! వాస్తవం ఏమిటంటే విద్వేషాన్ని సకల సంప్రదాయాలను, ప్రముఖ ప్రమాణాలను, మానవతనే భస్మీపటలం చేయనంత వరకు ప్రభుత్వం, పాలనా వ్యవస్థ అయినా ఉలిక్కి పడదు, మీడియా అయినా లేచి నిలబడదు. ఇదే వాస్తవికత, ఇదే మనందరి అనుభవం. చెప్పుకోడానికి జాతీయ ప్రచార ప్రసార సాధనాలు (National Media) ఉన్నాయన్నమాటే గాని ఏదీ ఈ అల్ప సంఖ్యాక దీనుల అరుపుల్ని, ఘోషను అసలే పట్టించుకోదు.

## మీడియా ఆవశ్యకత

పరిస్థితుల ఈ స్వరూపం చాటిచెప్పేదేమిటీ? ముస్లిములు, ఈ అతి ప్రాచీన దేశంలో తమ సౌభాగ్యం రీత్యా స్థానం పదిల పరచుకున్న రెండవ స్థానంలోని మెజారిటీ జనాభా లేదా దేశంలోనే అతి పెద్ద మైనారిటీ జనాభా, ముస్లిములు, తమ కొరకు, తమదంటూ ఓ ప్రచార ప్రసార సాధనాల వ్యవస్థ, కనీసం ప్రతి ప్రాంతీయ భాషలో ఓ దినపత్రిక, ఓ ఛానెల్, జాతీయ స్థాయిలో ఓ ఆంగ్ల దినపత్రికను ఏర్పరచుకోవడం అత్యంతావశ్యకం. అయితే అటువంటి వ్యవస్థ లేదా ఓ సంస్థ కొన్ని అతి ముఖ్యమయిన షరతులకు లోబడి వ్యవహరించవలసి ఉంటుంది.

➢ అది ఏ వైపునకు కూడా మొగ్గుదల గలదిగా Partisan, Based లేదా ఏదో ఒక సముదాయానికి చెందినదిగా Community Based ఉండరాదు. దానికి బదులుగా స్వతంత్ర ప్రతిపత్తి, సర్వ సమానత, ప్రజాస్వామికమయినదిగా, మానవ హక్కులకు, న్యాయం, ధర్మం, సత్యం ఆధారంగా వ్యవహరించేదిగా ఉండాలి. అన్యాయానికి ఎదురొడ్డి పోరాడే, న్యాయ ధ్వజవాహికగా మెలిగేదయి ఉండాలి. ఎటువంటి ఉదంతాన్నయినా కారంచేడు అయినా, గ్రాహమ్ స్టేయిన్స్ వ్యవహారమయినా, (కర్ణాటకలోని) తేలిగి సమస్య అయినా, గుజరాత్ ట్రాజెడీ అయినా అన్నింటినీ సమాన స్థాయిలో చూడగలిగేదిగా చూపగలిగేదిగా ఉండాలి, అన్నింటికీ సమాన అవకాశాలు, స్థానం కల్పించేదిగా, వాటికై పోరాడేదిగా ఉండాలి.

➢ అది ప్రమాణబద్ధ రాజకీయాలకు తోడ్పాటునిచ్చేదిగా ఉండాలి. ప్రజా జీవితంలో అవినీతిని, కరప్షన్‌ని అంతమొందించేందుకు ప్రయత్నించేదిగా ఉండాలి.

➢ అదేవిధంగా ముస్లిముల సాముదాయిక ప్రత్యేకత కొరకు, ధార్మిక హక్కుల కొరకు, సాంస్కృతిక, సామాజిక పురోభివృద్ధి కొరకు ముమ్ముందుగా ఉండేదిగా రూపొందాలి. ముస్లిముల న్యాయబద్ధమయిన, ధర్మబద్ధమయిన కోరికల పరిపూర్తి కొరకు, వారి నిజమయిన సమస్యల పరిష్కారం కొరకు అది సముదాయాల పక్షాన బలమయిన స్వరమయి మనగలగాలి.

➢ అది ముస్లిములు, ఇస్లామ్ పట్ల వ్యాపించిన అపార్థాలను, అపోహల్ని తొలగించటంలో ప్రభావశీలమయిన దారిగా రూపొందుతూనే, అదే సమయాన ఏకపక్షమయిన అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించేదిగా రూపొందరాదు.

➢ ఈ ఆశయాల సాధనకు, ప్రాంతీయ భాషల్లో మీడియా అత్యంతావశ్యకం. ఈ రోజుల్లో జనులు, ఉత్తరాది వారయినా, దక్షిణాది వారయినా ప్రాంతీయ భాషల్లోనే మాటలాడటమయినా, చదవడమయినా అలవరచుకున్నారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో ఇంగ్లీషు వార్తాపత్రిక, హిందీ చానెల్ కూడా అంతే అవసరం.

➢ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉర్దూ భాష క్రమంగా ప్రజాబాహుళ్యానికి దూరమయిపోతోంది. పత్రికల రీడర్‌షిప్, ఛానెల్స్ వ్యూవర్‌షిప్ (Readership, Viewership) రెండూ బాగా పడిపోతున్నాయి. వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో ముస్లిముల అక్షరాస్యత (Literacy rate) కేవలం 40 శాతమే. మరి జనాభా రీత్యా 45శాతం జనం పల్లెల్లోనే (Rural Area) నివసిస్తున్నారు. పట్టణవాసులు అత్యధికంగా ఇంగ్లీషు మీడియంలో విద్యనభ్యసిస్తున్నారు.

ఈ సందర్భంలో ఒక విషయం చెప్పడం సముచితమని తలుస్తున్నాను. హైదరాబాద్‌లోని ఉర్దూ ప్రెస్ (పత్రికలు) సముదాయ బద్ధమయినదిగా అగుపిస్తుంది. ముస్లిములే వ్రాస్తారు, ముస్లిములే ముద్రించుకుంటారు, ముస్లిములే చదువుకుంటారు. నన్ను మన్నించవలసిందిగా వేడుకుంటున్నాను. ఈ ఉర్దూ పత్రికా రచన తన దృష్టికోణాన్ని (Out look) సువిశాలతను సృజించుకోవలసి ఉంటుంది. ముస్లిమేతర సోదరుల్లో ఉర్దూ భాష దాదాపు పూర్తిగా క్షీణించిపోయింది. ఉర్దూ భాష అభివృద్ధి కొరకు సయితం కృషి జరగవలసి ఉంది. గతంలో మలేషియా ప్రధానిగా వ్యవహరించిన "మహాతిర్ ముహమ్మద్" ఒక సందర్భంలో-Those Who Control the Media shall control the World "ఎవరయితే మీడియాని కంట్రోల్ చేస్తారో వారే ప్రపంచాన్ని కంట్రోల్ చేస్తారు" అని అన్నారు. అది ఎంత యథార్థమో మనకన్నా ఎవరు గుర్తించ గలరు?

# ఆరోగ్యం దేవుడు ఇచ్చిన గొప్ప వరం

- షేఖ్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం

**"ఆరోగ్యమే మహాభాగ్యము" అన్నారు పెద్దలు.**

"ఈసురోమని మనుషులు ఉంటే, దేశమే గతి బాగుపడునోయ్" అన్నారు గురజాడ.

వ్యాధుల బారినపడకుండా, ఆరోగ్యంగా జీవించడానికి శ్రద్ధ వహించాలి అంటుంది ఇస్లాం.

ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనేక మార్గదర్శకాలను బోధించారు.

అందులో ముఖ్యమైనది, పరిశుభ్రత, పరిశుద్ధత.

"పరిశుభ్రత విశ్వాసంలో సగభాగం" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

"మల విసర్జన తర్వాతే కాదు, మూత్ర విసర్జన చేసిన తర్వాత కూడా నీటితో శుభ్రం చేసుకోవాలి. నీరు లభించని పక్షంలో ఇటుక లేదా మట్టి పెడ్డతో శుభ్రం చేసుకోవాలి" అని తెలిపారు.

"మూత్ర విసర్జన చేసేటప్పుడు నిలబడి చేయరాదు. కూర్చొని చేయాలి. గట్టి ప్రదేశంలో కాకుండా మెత్తని ప్రదేశంలో మూత్ర విసర్జన చేయాలి. తద్వారా మూత్ర తుంపర్లు మీద పడకుండా జాగ్రత్త వహించాలి" అని సూచించారు.

మల మూత్ర విసర్జన తర్వాత, నమాజ్ చేయడానికి ముందు తప్పనిసరిగా 'వుజూ' అనగా కాళ్ళు చేతులు, ముఖం, ముక్కు, నోరు మూడుసార్లు కడిగేసుకోవాలి. తద్వారా సూక్ష్మ క్రిముల బారిన పడకుండా రక్షించబడతాము.

ఆహార పానీయాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

"సకల రోగాలకు మూలం పొట్ట" అన్నారు ప్రవక్త.

దైవాన్ని విశ్వసించే దాసులు బతకడానికి తింటారు. అవిశ్వాసి తినడానికే బతుకుతాడు.

"విశ్వాసి మితంగా తింటాడు. అవిశ్వాసి కడుపు నిండా తింటాడు" అని అన్నారు ప్రవక్త (స).

పొట్టను మూడు భాగాలుగా చేసి, ఒక భాగం ఆహారం కోసం మరో భాగం నీటి కోసం, మూడో భాగం గాలి కోసం ప్రత్యేకించాలి.

తినడానికి ముందు, తిన్న తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

తినడానికి ముందు, మట్టిని రకరకాల ఆహార పదార్థాలుగా మలచిన సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలియజేయాలి.

పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి.

"అధర్మ సంపాదనతో కడుపు నింపడం అగ్నితో కడుపు నింపుకోవడం లాంటిది" అని తెలిపారు ప్రవక్త.

మత్తు కలిగించే ప్రతిదీ ఇస్లాం నిషేధించింది.

మత్తు పానీయాలు, పదార్థాల సేవనం చేసేవారికి వంద కొరడా దెబ్బలు కొట్టే శిక్ష విధించాలంటుంది ఇస్లాం.

"మత్తు పానీయం సేవిస్తే నలభై రోజుల వరకు వారి ఆరాధన స్వీకరించబడదు" అని ప్రవక్త ముహమ్మద్ (స) హెచ్చరించారు.

పండ్లు కూరగాయలు ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

ముఖ్యంగా తేనె, ఖర్జూర, ఆలివ్ నూనె, జైతున్ నూనె, దానిమ్మ గురించి ఖురాన్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించడం జరిగింది.

పెందలకాడనే లేవాలి. సూర్యోదయానికి ముందు చేసే నమాజ్ వల్ల అధిక పుణ్యాలు లభిస్తాయి అని, సూర్యోదయం తరువాత మేలుకునే వారి జీవితంలో శుభాలు లభించవని తెలిపి ముస్లింలు ఉదయాన్నే లేచేలా చేసారు ప్రవక్త ముహమ్మద్ (స).

నిద్ర ఆరోగ్యానికి అసలు మందు. కంటినిండా కునుకు వల్ల మనిషికి ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది.

అందుకే ఇషా నమాజ్ అంటే రాత్రివేళ చేసే ప్రార్థన తరువాత అతిముఖ్యమైన పని ఉంటే తప్ప వెంటనే నిద్ర పోవాలి అని బోధించారు ప్రవక్త ముహమ్మద్ (స).

నేడు మానవ సమాజాన్ని పట్టి పీడుస్తున్న అతి ముఖ్యమైన వ్యాధి మానసిక ఒత్తిడి. అదే బిపి షుగర్.

వీటికి మందు నమాజ్, రోజా, ఖురాన్ పారాయణం.

రోజూ ఐదుసార్లు నమాజ్ ఆచరించే వారికి మానసిక రుగ్మతలు రావు అని పరిశోధనలు చెబుతున్నాయి.

వ్యాధిగ్రస్తులను పరామర్శించడం కూడా ఒక ఆరాధనే అంటుంది ఇస్లాం.

వ్యాధిగ్రస్తులను పరామర్శించండి. మీరు దానికోసం వెచ్చించే సమయంలో దైవదూతలు మీ కోసం ప్రార్థన చేస్తుంటారు అని తెలిపారు ప్రవక్త ముహమ్మద్ (స).

ఇలా చేయడం వల్ల వ్యాధిగ్రస్తులలో మనోధైర్యం ఏర్పడుతుంది. తద్వారా త్వరగా కోలుకోవడానికి అవకాశం ఉంటుంది.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అంటుంది ఇస్లాం.

చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదు. నడిచే దారిలో ప్రవహించే నదుల చెంత మలమూత్ర విసర్జన నిషేధించింది.

అనవసరంగా చెట్టు ఆకులు తెంచడం కూడా పాపమే అంటుంది ఇస్లాం.

భూమి మీద ఒక చెట్టు నాటండి. పరలోకంలో దైవం మీ పేరిట ఒక చెట్టు నాటుతాడు.

మీరు నాటిన చెట్టు వల్ల పక్షులు, జంతువులు, కీటకాలు, మానవులు ప్రయోజనం పొందుతున్నంత కాలం మీ ఖాతాలో పుణ్యాలు లిఖించబడుతూనే ఉంటాయి అని తెలిపారు ప్రవక్త ముహమ్మద్ (స).

ఇలా పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, అది కూడా ఆరాధనే అని బోధించిన ధర్మం ఇస్లాం.

ఇస్లాం బోధనలు ఆచరిద్దాం. ఆరోగ్యంగా, ఆనందంగా జీవిద్దాం. ●

## ఒక మంచి మాట

"బుద్ధి వివేకాల ఆధారంగానే జీవనోపాధి లభించే మాటైతే పశువులు, అవివేకులు ఆకలితో చావటం తథ్యం."

– ఇమామ్ గజాలీ (రహ్మ)


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# ఫెమినిజం ప్రచారాలు - ఇస్లాం వాస్తవాలు

- ముహమ్మద్ షరీఫ్

**నూతన** నాస్తికత్వం మతాన్ని విస్మరించేలా చేయడానికి పితృస్వామ్య వ్యవస్థకు ప్రతిగా ఫెమినిజం అనే భావనను సమర్థిస్తుంది. మహిళల అణచివేతకు మతమే కారణమని ప్రజల మనో మస్తిష్కాల్లో బలంగా చొప్పించింది. ఇస్లాంలో స్త్రీ స్థానంపై అనేక విమర్శలు గుప్పిస్తుంది. ఇస్లాం ప్రకారం ఇద్దరు స్త్రీల సాక్ష్యం ఒక పురుషుని సాక్ష్యానికి సమానం అని, పురుషుడిని కుటుంబ యజమానిగా గుర్తించిందని, భార్యను కొట్టే అనుమతి ఇచ్చిందని, బహుభార్యత్వం ఉందని అనేక అంశాలను చూపుతూ ఇది పితృస్వామ్య భావనల ప్రతిఫలం కనుక మతాన్ని సవాలు చేసి మహిళలు తమ హక్కులను సాధించుకోవాలనే ఆకర్షణీయ నినాదాలతో ఉద్యమాలు బయలుదేరాయి.

➤ ఫెమినిజం (స్త్రీవాదం) అనేది స్త్రీ పురుష సమానత్వం కోసం వాదించే, మహిళలను అణచివేస్తున్న పితృస్వామ్య వ్యవస్థలను సవాలు చేసే సామాజిక, రాజకీయ మరియు సాంస్కృతిక ఉద్యమంగా, మహిళలపై జరుగుతున్న వివక్షను అంతమొందించే ఉద్యమంగా, లింగ వివక్ష అంతానికి కృషి చేసేదిగా, న్యాయ వంతమైన సమాజాన్ని నిర్మించేదిగా ప్రచారమయ్యింది.

➤ స్త్రీవాదం ఈ క్రింది విషయాలు సాధించామని చెప్పుకుంటుంది.

1. మహిళల ఓటు హక్కు
2. పునరుత్పత్తి హక్కులు
3. సమాన వేతన చట్టం
4. లింగ-ఆధారిత హింస నుండి రక్షణ
5. రాజకీయాలు నాయకత్వ స్థానాల్లో పెరిగిన ప్రాతినిధ్యం.
6. అబార్షన్ హక్కు

### పాశ్చాత్యుల ద్వంద్వ వైఖరి

➤ సాధారణంగా పాశ్చాత్యదేశాలు ప్రగతిశీలమైనవిగా గుర్తింపు పొందాయి. ఫెమినిస్టు ఉద్యమాల చలవతో అక్కడ విచ్చలవిడితనం బాగా పెరిగింది. అభ్యుదయానికి ఆలవాలమని చెప్పుకుంటున్న పాశ్చాత్య దేశాల్లో సైతం ఇంకా మతం పట్ల ఆదరణ తగ్గకపోవడం, మహిళల పాత్రపై భిన్నాభిప్రాయాలు వెలుగు చూడడం గమనార్హం.

యూరోపియన్ యూనియన్, గ్రేట్ బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ తదితర సోకాల్డ్ అభ్యుదయ దేశాల్లో ఇంకా స్త్రీ, పురుషుల వేతనాల్లో 20 శాతానికి పైగా వ్యత్యాసం ఉండటం, అత్యాచారాలు పెరగడం, మహిళలకు రాజకీయాల్లో ఆశించినంత చోటు దక్కకపోవడం పాశ్చాత్యుల ద్వంద్వ వైఖరికి నిదర్శనాలుగా నిలుస్తాయి.

మతాధారిత సమాజాల్లో వేటినైతే చెడులుగా చూపించడం జరుగుతుందో అవన్నీ ఈ అభ్యుదయ సమాజాల్లోను కనిపిస్తాయి. ఇది వారి సైద్ధాంతిక డొల్లతనాన్ని చూపిస్తుంది.

### స్త్రీ జాతిని అవమాన పరచడం

స్త్రీని వివస్త్రను చేయడం, స్వేచ్ఛ పేరుతో ఫ్యాషన్ పరేడ్‌ల నిర్వహణ, ఆమె శరీరాన్ని వ్యాపారీకరించడం, పెట్టుబడి దారీ వ్యవస్థ విజయానికి, వస్తువుల మార్కెటింగ్‌కు స్త్రీ శరీరాన్ని వాడుకోవడం వీరి ప్రధాన ఉద్దేశ్యం. ఎంప్లాయిమెంట్, ఎంపవర్ మెంట్ పేరుతో ఆమెను ఉత్పత్తి రంగంలోకి తీసుకువచ్చి తక్కువ వేతనానికే ఆమె శ్రమను దోపిడీ చేసే ప్రయత్నమే ఇది,

### ఫెమినిస్టులు సమాధానం చెప్పలేని ప్రశ్నలు

ఎడ్యుకేషన్ టు ఉమెన్, ఎంప్లాయిమెంట్ టు ఉమెన్, ఎంపవర్ మెంట్ టు ఉమెన్ అని నినాదాలిచ్చే ఫెమినిస్టులు ఆడపిల్లను కడుపులోనే కరగదీసే అబార్షన్ హక్కును ఇవ్వడం ద్వారా మహిళకు స్వతహాగా మహిళలే రైట్ టు బర్త్‌ను నిరాకరించడం విషాదం కాదా?

ఆధునికత పేరుతో అందచందాలపై కాంక్షను పాశ్చాత్య స్త్రీలో పెంచి మత విలువలను, కుటుంబ వ్యవస్థను నాశనం చేసి భావితరాల భవితను, దేశాల భవితను ప్రశ్నార్థకం చేయలేదని చెప్పగలరా?

విచ్చలవిడితనం కారణంగా, పిల్లలకు తండ్రి ఎవరో చెప్పలేని, తెలుసుకోనవసరం లేని సమాజాల్లో అనేక నైతిక రుగ్మతలు కనిపిస్తున్నాయి. వీటినే అభ్యుదయమని మురిసిపోదామా? పెరుగుతున్న ఆల్కాహాలిజం, గన్ కల్చర్‌లను స్వేచ్ఛకు ప్రతీకలుగా భావించడం ఏం అభ్యుదయమో సోకాల్డ్ ప్రగతిశీల వాదులే చెప్పాలి.

### ఫ్రాన్స్‌లో బెడిసికొట్టిన ఫెమినిజం

ఫ్రాన్స్, దాని బలమైన సంప్రదాయమైన లిబర్టీ, ఈక్వాలిటీ, ఫ్రెటర్నిటీ (స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం)కు ప్రసిద్ధి చెందింది. అక్కడ మహిళల దుస్తుల స్వేచ్ఛ సాధారణంగా

గౌరవించ బడుతుంది. అయితే, ఇటీవలి కాలంలో వచ్చిన మార్పులు ఫ్రాన్స్‌లో ఫెమినిజం పరిమితులను, వైఫల్యాలను ఎత్తిచూపుతాయి.

- 2016లో, కొన్ని తీరప్రాంత పట్టణాల్లో "బుర్కినీ నిషేధం" ప్రవేశపెట్టబడింది, కొంతమంది ముస్లిం మహిళలు ధరించే పూర్తి శరీర స్విమ్‌సూట్‌లను నిషేధించగా, తర్వాత ఈ నిషేధాన్ని కౌన్సిల్ ఆఫ్ స్టేట్ రద్దు చేసింది.

- 2019లో, ఫ్రెంచ్ సెనేట్ లైంగిక సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ గురించి ఆందోళన చెందుతూ బహిరంగ ప్రదేశాల్లో Discreet (గౌరవప్రదమైన) దుస్తులు ధరించమని మహిళలను ప్రోత్సహించే తీర్మానాన్ని ఆమోదించింది.

- 2020లో, ప్రభుత్వం "లింగ-ఆధారిత హింస", "సెక్సిస్ట్" దుస్తులకు వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించింది,

కాగా కొంతమంది విమర్శకులు దీనిని వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరంగా భావించారు.

వివేకవంతమైన, గౌరవప్రదమైన Discreet వస్త్రధారణ క్రింది విషయాలను కలిగి ఉంది.

- నిరాడంబరమైన, అందచందాలు బహిర్గతం కాని, తనవైపు దృష్టిని ఆకర్షించని దుస్తులు అని అర్థం.

గౌరవప్రదమైన (Discreet) దుస్తులకు ఉదాహరణలు:

- శరీరాన్ని సరిగ్గా కప్పి ఉంచే వదులుగా ఉండే బట్టలు
- మితమైన నెక్‌లైన్‌లు, స్లీవ్‌లతో కూడిన బట్టలు
- మోకాలి క్రిందవరకు ఉండే దుస్తులు
- బిగుతుగా లేని ప్యాంటు
- పారదర్శకంగా లేని టాప్స్
- ప్రకాశవంతమైన రంగులు లేదా బోల్డ్ లోగోలు లేని దుస్తులు

విచక్షణతో కూడిన దుస్తులు తరచుగా వృత్తిపరమైన, వ్యాపారం లేదా వృత్తులకు అనుబంధించబడతాయి, ఇక్కడ తమను తాము గౌరవప్రదంగా ప్రదర్శించడం లక్ష్యం.

(ఆధారం: బీబీసీ వార్తలు, The gardian, france 24)

## USలో స్త్రీవాద వ్యతిరేక ఉద్యమం

USలో స్త్రీవాద వ్యతిరేక ఉద్యమం క్రిందిపేర్లతో పనిచేస్తుంది.

1. పురుషుల హక్కుల కార్యకర్తలు (MRAS): నేషనల్ కోయలేషన్ ఫర్ మెన్ (NCM), పురుషుల హక్కుల ఉద్యమం (MRM) వంటి సంస్థలు.

2. స్త్రీ-వ్యతిరేక సంప్రదాయవాదులు

3. **రెడ్ పిల్ ఉద్యమం:** పురుషుల గుర్తింపును ప్రోత్సహించే, స్త్రీవాదాన్ని విమర్శించే ఆన్‌లైన్ కమ్యూనిటీ,

4. **ఆల్ట్-రైట్ ఉద్యమం:** పితృస్వామ్య, స్త్రీ-వ్యతిరేక దృక్పథాలను తరచుగా ప్రోత్సహించే ఒక తీవ్ర-రైట్ భావజాలం కల ఉద్యమం

5. ఉమెన్స్ లిబరేషన్ ఫ్రంట్ (WOLF) : స్త్రీల హక్కులకు ముప్పుగా భావించే లింగమార్పిడి హక్కులను విమర్శించే రాడికల్ ఫెమినిస్ట్ సంస్థ.

ఫ్రాన్స్‌లో స్త్రీవాద వ్యతిరేక ఉద్యమ భావజాలాలు, వ్యక్తులు :-

1. "లెస్ హొమ్స్ లిబ్రేస్" (ఫ్రీ మెన్) వంటి స్త్రీ-వ్యతిరేక పురుషుల హక్కుల సంఘాలు.

2. నేషనల్ ర్యాలీ (గతంలో నేషనల్ ఫ్రంట్) వంటి తీవ్ర రైట్ జాతీయవాద ఉద్యమాలు తరచుగా స్త్రీ వాదాన్ని విమర్శిస్తాయి.

3. అబార్షన్, స్వలింగ వివాహాలను వ్యతిరేకించే "లా మానిఫ్ పోర్ టౌస్" వంటి సంప్రదాయవాద కాథలిక్ సమూహాలు.

4.ఎరిక్ జెమ్మూర్ వంటి కొంతమంది సంప్రదాయవాద, స్వేచ్ఛావాద ఆలోచనాపరులు, వారు "లింగ భావజాలం"గా భావించే వాటిని విమర్శిస్తారు, వీటిని స్త్రీవాదం యొక్క అతిగా భావించారు.

యూరోపియన్ యూనియన్‌లో స్త్రీవాదానికి ప్రతివాద ఉద్యమం.

1. **లింగ వ్యతిరేక ఉద్యమాలు:** పోలాండ్, హంగేరి క్రొయేషియా వంటి దేశాల్లో చురుకుగా ఉన్న ఈ సమూహాలు లింగ అధ్యయనాలు, లింగ సమానత్వ విధానాలు LGBTQ హక్కులను వ్యతిరేకిస్తాయి.

2. **పురుషుల హక్కుల కార్యకర్తలు:** యూరోపియన్ పురుషుల హక్కుల ఉద్యమం (EMRM) పురుషుల సమస్యలపై అంతర్జాతీయ సమావేశం (ICMI) వంటి సంస్థలు కస్టడీ హక్కులు, తప్పుడు ఆరోపణల లింగ పక్షపాతం వంటి సమస్యలపై దృష్టి సారించాయి.

3. **కన్జర్వేటివ్ ఫార్ రైట్ పార్టీలు:** ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (AFD), ఫ్రీడమ్ పార్టీ ఆఫ్ ఆస్ట్రియా (FPÖA), స్వీడన్ డెమొక్రాట్లు వంటి పార్టీలు తరచుగా స్త్రీవాదాన్ని విమర్శిస్తాయి.

4. స్త్రీ-వ్యతిరేక మేధావులు: స్త్రీవాదం, లింగ అధ్యయనాలను విమర్శించే ఫ్రాన్స్‌లోని ఎరిక్ జెమ్మూర్ ఇటలీలోని అలెశాంద్రో మెలుజ్జీ వంటి వారున్నారు.

5. యూరోపియన్ కన్జర్వేటివ్ రిఫార్మిస్ట్ ఉద్యమం: UK యొక్క కన్జర్వేటివ్ పార్టీ,చెక్ రిపబ్లిక్ లోని సివిక్ డెమోక్రటిక్ పార్టీ వంటి పార్టీలను కలిగి ఉన్న రాజకీయ సమూహం, ఇది తరచుగా సాంప్రదాయ విలువలకు ప్రాధాన్యతనిస్తుంది.

6. యూరోపియన్ క్రిస్టియన్ పొలిటికల్ మూవ్‌మెంట్ (ECPM):

**మిగతా 29వ పేజీలో...**



# యువతలో పెరుగుతున్న నేర ప్రవృత్తి

- అర్షియా

ఓ అబ్బాయి కాలేజీ అమ్మాయికి ప్రేమ సందేశం పంపాడు, అమ్మాయి నిరాకరించడంతో, రద్దీగా ఉండే మార్కెట్‌లో ఆమె గొంతు కోశాడు. ఇది ఆమె మరణానికి కారణమైంది. తరువాత అబ్బాయి సరస్సులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణ ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో జరిగింది. జార్ఖండ్‌లో 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న నలుగురు యువకులు 19 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేశారు. అదేవిధంగా, కోల్‌కతాలోని రెసిడెంట్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన దారుణమైన సంఘటన దేశ వ్యాప్త ఆందోళనకు కారణమైంది.

యువతలో పెరుగుతున్న నేరప్రవృత్తికి అద్దం పట్టే ఇలాంటి వార్తలను రోజూ చదువుతున్నాం, వింటున్నాం. ప్రేమ వైఫల్యం కారణంగా ప్రతి సంవత్సరం ఎంతో మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇతరులను హతమారుస్తున్నారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. రేప్ కేసుల గ్రాఫ్‌లు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. మహారాష్ట్ర, ఢిల్లీ బీహార్‌లలో ఈ నేరాల రేటు మరింత ఎక్కువగా ఉంది.

నేషనల్ క్రైమ్ రిపోర్ట్ ప్రకారం, 16 నుండి 18 సంవత్సరాల వయస్సు గల యువకులలో నేరాల నిష్పత్తి పెరుగుతోంది, ఇందులో దొంగతనం, దోపిడీ, విధ్వంసం, మాదకద్రవ్యాల వ్యసనం, అత్యాచారం, లైంగిక అనైతికత మొదలైనవి ఉన్నాయి.

యువత ప్రవర్తన వారిని నేరస్తులను చేస్తోంది.

యువతలో నేరాల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా ముస్లిమ్ యువతలో పెరుగుతున్న నేరాల సంఖ్య మరింత ఆందోళన కలిగిస్తుంది. జాతీయ ఏజెన్సీలు అందించిన డేటా ప్రకారం, దేశంలో రోజుకు సగటున 87 అత్యాచారాలు జరుగుతున్నాయి, NCRB యొక్క తాజా డేటా ప్రకారం , గత సంవత్సరంతో పోలిస్తే 13.2% పెరిగింది. మాదకద్రవ్యాల వ్యసనం బాగా పెరిగింది. మహా నగరాల్లోని కాలేజీ, స్కూలు విద్యార్థులే ఈ వ్యసనానికి బానిసలవుతున్నారని నివేదిక తేల్చిచెప్పింది.

### సామాజిక పరిస్థితి

దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, పేదరికం, విద్య అందుబాటులో లేకపోవడం, నిరుద్యోగం వంటి అంశాలు యువత తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు నేరాల బాట పట్టేలా చేస్తున్నాయి.

### కుటుంబ వ్యవస్థ

కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడం, కుటుంబం, పెద్దల మధ్య సంబంధాలు లేకపోవడం, కుటుంబంలో తల్లిదండ్రులు ఆర్థిక పోరాటం, నిరక్ష్యరాస్యత, కొన్నిసార్లు నేరాల వైపు తల్లిదండ్రుల మొగ్గు యువతను నేరస్తులుగా మారుస్తున్నాయి.

### మానసిక ఆరోగ్యం

నేడు యువతరం వృత్తిపరమైన ఒత్తిడికి గురవుతున్నారు. చుట్టూ ఉన్న పరిస్థితులు తీవ్ర డిప్రెషన్‌కు దారితీస్తున్నాయి.

యువతలో మితిమీరిన సాంకేతికత వినియోగం, మొబైల్, ఇంటర్నెట్, టీవీ, సినిమాలు, వీడియో గేమ్‌లు యువతలో ప్రతికూల మనస్తత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈ స్వభావం నేరాలను ప్రేరేపిస్తుంది.

తల్లిదండ్రుల మొదటి బాధ్యత ఏమిటంటే, తమ పిల్లలకు ఉన్నత చదువులతో పాటు నైతికతను పెంపొందించాలి. విద్యాసంస్థల్లోనూ నైతిక విలువల్ని పాఠ్యాంశంగా చేర్చాలి. ప్రభుత్వాలు యువతను కేవలం తన రాజకీయ లబ్ధి కోసమే వాడుకుంటున్నారే తప్ప వారి భవిష్యత్తు, ధర్మబద్ధమైన సమాజ స్థాపనపై సీరియస్‌గా వ్యవహరించకపోవడం బాధాకరం. ●

# గురువు గొప్పతనం

**పెళ్లి వేడుక** జరుగుతోంది. అందులో ఒక వ్యక్తి తనకు తెలిసిన ఓ పెద్దాయన్ను గుర్తుపట్టి వెళ్లి పలకరించాడు. ఆ పెద్దాయన చూపు ఆనకపోవడంతో పలకరించింది ఎవరా అని కళ్లకు చెయ్యి అడ్డుగా పెట్టి పట్టిపట్టి చూశాడు. తీరా గుర్తుపట్టాడు. 'నువ్వు ప్రైమరీ స్కూలు శిష్యుడివి కదూ. ఇప్పుడేం చేస్తున్నావురా' అని నవ్వుతూ ఆప్యాయంగా అడిగారాయన. 'నేనూ మీలానే స్కూల్ టీచర్‌ను. దీనికి మీరే స్ఫూర్తి' అని సంతోషంగా చెప్పాడు. అదెలారా నాయనా అని అడిగితే గతంలోకి వెళ్లాడు.. 'ఒక రోజు క్లాస్ రూములో ఒక విద్యార్థి చేతివాచి దొంగతనానికి గురయ్యింది. ఆ వాచీ నాకెంతగానో నచ్చడంతో దాన్ని నేనే దొంగిలించాను. వాచీని ఎవరైతే తీశారో వెంటనే ఇచ్చేయాలని క్లాసులో ప్రకటించారు. ఆ సమయంలో గడియారాన్ని తిరిగి ఇచ్చేయాలనుకున్నాను కానీ భయంతో ఇవ్వలేకపోయాను. అందరి ముందూ పరువు పోతుందని భయపడ్డాను. మమ్మల్ని అందరినీ గోడ వైపునకు తిరిగి కళ్లుమూసుకొని నిల్చోవాలని చెప్పారు. మేమంతా అలా నిలబడ్డాక అందరి జేబులు గాలించారు. అప్పుడు నా జేబులోనే ఆ గడియారం దొరికింది. నా పేరు మాత్రం ఎవ్వరికీ చెప్పకుండా ఆ గడియారం ఎవరిదో అతనికి ఇచ్చేశారు. ఆ రోజు మీరు చేసిన మంచి పని నాలో ఎంతో పరివర్తన తీసుకొచ్చింది. ఇంకెప్పుడూ దొంగతనం చేయరాదని నిర్ణయించుకున్నాను. నేను కూడా టీచర్ కావాలని గట్టిగా సంకల్పం చేసుకున్నాను.' అని పాత రోజులను గురువు గారితో నెమరవేసుకున్నాడు. అంతలో గురువు గారు కలుగజేసుకుని 'ఆ సందర్భంలో నేను కళ్లకు గంతలు కట్టుకున్నాను. ఆ వాచీ దొంగిలించిందెవరో నాకూ ఈ రోజే తెలిసింది' అని చెప్పడంతో ఆ విద్యార్థి ఆశ్చర్యపోయాడు.

★★★

ఖలీఫా హారూన్ రషీద్ తన ఇద్దరు పిల్లలకు ఇంట్లోనే చదువులు చెప్పించేవారు. ఇమామ్ చెప్పే పాఠాలను ఖలీఫా ఇద్దరు పిల్లలు మామూర్, అమీన్ ఎంతో బుద్ధిగా వినేవారు. గురువు గారికి పరమ విధేయులుగా ఉండేవారు. ఒకరోజు గురువుగారు చదువు చెప్పి ఇంటికెళ్లబోయారు. అంతలో అన్నదమ్ములిద్దరూ లేచి గురువు గారికి తానంటే తాను మేజోళ్లు తొడిగిస్తానని పోటీపడ్డారు. ఇద్దరి మధ్య స్వల్ప గొడవ జరిగినంత పనయ్యింది. ఇంతలో గురువుగారు కలగజేసుకుని 'చెరో చెప్పు తొడిగించండి' అని చెప్పడంతో ఇద్దరి గొడవ సద్దుమణిగింది. ఈ ఘటన జరిగిన కొన్ని రోజులు గడిచిన తరువాత ఖలీఫాను కలుసుకున్నారు. ఆ సమయంలో ఖలీఫా హారూన్ రషీద్ "అత్యంత గౌరవనీయుడెవడు" అని ఇమామ్‌ను అడిగాడు. దానికాయన "ఖలీఫా కంటే ఆదరణీయుడు, గౌరవ నీయుడు ఇంకెవరుంటారు" అన్నారు. దానికి ఖలీఫా హారూన్ రషీద్ "ఖలీఫా కొడుకులు ఎవరికైతే చెప్పులు తొడిగించారో అతను గౌరవనీయుడు" అన్నారు. గురువులను ప్రవక్తల వారసులుగా అభివర్ణించారు ప్రవక్త మహనీయులు. జ్ఞానాన్ని నేర్పే వారి కోసం సముద్రంలో చేపలు, భూమికింద కీటకాలు, ఆకాశంలో పక్షులు వేడుకుంటాయని ప్రవక్త(స) చెప్పారు. జ్ఞానసంపన్నులైన గురువులకు అల్లాహ్ మహోన్నత స్థానాలు ప్రసాదిస్తాడని ఖుర్ఆన్ పేర్కొంటోంది. "మీలో విశ్వసించిన వారికి, జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు. (57:11)

**27వ పేజీ తరువాయి...**

క్రైస్తవ విలువలను ప్రోత్సహించే తరచుగా స్త్రీవాదం, లింగ భావజాలాన్ని విమర్శించే రాజకీయ సమూహం.

7. ఐడెంటిటేరియన్ మూవ్‌మెంట్: వలస-వ్యతిరేక,స్త్రీ-వ్యతిరేక అభిప్రాయాలను ప్రోత్సహించే తీవ్ర-రైటిస్ట్ ఉద్యమం.

మొత్తంమీద ఫెమినిజం పుట్టిన పాశ్చాత్య దేశాల్లోనే తన ఉనికి ప్రశ్నార్థకమయ్యే పరిస్థితులు వచ్చాయి.

నూతన నాస్తిక వాదులు మతాన్ని ఎంతలా వ్యతిరేకించినా ప్రజలు మతానికే ప్రాధాన్యతనివ్వడం గమనార్హం.

## ఇస్లాంలో మహిళ స్థానం

ఇస్లాం మహిళకు సముచితమైన స్థానం ఇచ్చింది. స్త్రీ, పురుషులిరువురూ సమానమని చెప్పింది. సమాన హక్కులను ఇచ్చింది. పురుషునిపై ఆర్థిక భారం మోపింది. మహిళలు ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనడాన్నుండి మినహాయింపు ఇచ్చింది. ఒకవేళ ఏదైనా కారణం చేత ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొన్నా వచ్చే ఆదాయాన్ని వినియోగించుకునే పూర్తి హక్కు మహిళకే ఇచ్చింది.

అంతేకాక వివాహ సందర్భంగా సంబంధాల ఎంపిక, తిరస్కరణ హక్కు, మహర్ పొందే హక్కులతోపాటు సంబంధాలు విషమిస్తున్న సందర్భంలో ఖులాను కోరే హక్కు ఇచ్చింది. నీతి నడవడులు పిల్లలకు నేర్పే శిక్షకురాలిగా భవిష్య తరాలకు వారధిగా ఉత్తమ నాగరికత నిర్మాణంలో మహిళకు ఇస్లాం ఇచ్చిన స్థానం సముచితం.

ఆధునిక పోకడలు వెర్రితలలు వేసి ఎన్ని ఇజాలు తీసుకొచ్చినా వాటిని అమలు చేయడం కష్టం. వాటి వల్ల వచ్చే విపరిణామాలకు గురికాక తప్పదు. దైవధర్మమే సమున్నత మానవ జీవితానికి రాచబాట.

❖

# మిమ్మల్ని మీరు నరకాగ్ని నుండి కాపాడుకోండి!

1

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**"మరి ఎవరయితే హద్దులు మీరి ప్రవర్తించి ఐహిక జీవితానికే ప్రాధాన్యమిచ్చారో వారికి నరకమే నివాస మవుతుంది". (నాజిఆత్: 37-39)**

## మరణం తప్పదు మనిషికి

ఎందరో మరణించారు. మరెందరో మరణ దూత వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. మనమందరం ఏదో ఒక రోజు మరణించ వలసిన వారమే. మనందరి శ్వాస ఏదో ఒక రోజు ఆగిపోతుంది. మనమే కాదు ఈ పుడమిపై మనుగడ సాగిస్తున్న ప్రతి ప్రాణికి మరణం ఉంది, ప్రతి వస్తువుకు నాశనం ఉంది. నిన్నటి వరకూ మనతోపాటు ఎందరో పరిచితులు-అపరిచితులుండేవారు. వారిలో ఒకడు ప్రేమ కావాలనేవాడు, ఒకడు పెళ్ళి కావాలనేవాడు, ఒకడు అంబానీ అంతటి ఆస్తి ఉండాలని, బిల్‌గేట్స్ అంతటి ఎత్తుకు ఎదగాలనుకునేవాడు. అయితే వీరిలో ఎందరి ఆశలు ఫలిం చాయో ఎందరి ఆశలు ఆడియాశలయ్యాయో ఆ దేవుడికే ఎరుక. ఏది ఏమయినా అందరి విషయంలో ఆ దేవుని మాట నిజమయింది:

ప్రతి జాతికి ఒక గడువు నిర్ణయం అయివుంది. ఒక జాతి గడువు పూర్తి అయినప్పుడు, ఒక్క గడియకాలం కూడా అది వెనకా ముందూ అవటం సంభవించదు. (సృష్టి ప్రారంభంలోనే అల్లాహ్ ఈ విషయాన్ని స్పష్టం చేశాడు). (ఆరాఫ్: 34)

మృత్యువు వారిని మెల్లగా తన ఒడిలోకి తీసేసుకుంటుంది. మనిషి చనిపోతాడు. పాము కుబుసం వదలి ముందుకు సాగిపోయినట్టు ఎంతో నాజుకుగా పెంచుకున్న గారాల దేహాన్ని వీడి మనిషి ఆత్మ పరలోకానికి పయనమవుతుంది. దానికి భౌతిక నేత్రాలయితే లేవుగానీ అది చూడగలుగుతోంది. దానికి మనకులాగు వీనులు లేవు గానీ, అది వినగలుగుతుంది. నరకం ఉందంటే నరలోకాన్నే నాకంలా భావించే కొందరు భ్రమ జీవులు ఎగిరి గంతులేస్తారు. కోపంతో కారాలు మిరియాలు నూరుతారు. సమాధి చేయబడిన శవం మట్టిలో కలిసి మట్టయిపోతుందనుకుంటారు. కాల్చబడిన శవం బూడిదయి కాటి మట్టిలో కలిసిపోతుందనుకుంటారు. ఐహిక జీవితం తప్ప పరలోక జీవితం లేదన్నది వీరి బలమయిన వాదన. దేహం కన్నా ఆత్మకున్న ప్రాముఖ్యతను వీరు గమనించేం దుకు సుముఖంగా ఉండరు. శరీరానికి మెరుగులు దిద్దుకుంటారే గానీ, ఆత్మను ప్రక్షాళనం చేసుకునేందుకు ప్రయత్నించరు. దాని గురించి ఆలోచించనన్నా ఆలోచించరు. సమాధి యాతన అనేది ఎంత నికృష్టమయినదో, అక్కడికి చేరిన ఆత్మలు ఎంతగా అల్లాడిపోతాయో, సమాధిలో పుణ్యాత్మలకు లభించే ఫలం ఎంత మధురాతిమధురమయినదో, అవి ఎంతటి సుఖవంతమయిన జీవితాన్ని అక్కడ గడుపుతాయో పూస గుచ్చినట్లు ప్రవక్త (స) వారు చెప్పినా మారని ఈ జనం నిజంగా సమాధికేగిన ఆత్మల్లోని ఏ ఒక్క ఆత్మ అయినా తిరిగి భూవాసుల వద్దకు పోయి వివరించినా మారుతారన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే అది వారి అనుభవంలోనికి రానిది గనక. అయినా అలా జరగడానికి వీలు లేదు. అలా వెళ్ళాలని కోరుకోని వారు ఉండరని కాదు అర్థం- ఉంటారు. కానీ వారికి లభించే సమాధానం ఏమిటి?

ఈ ప్రజలు ఇలా అంటారు; "మేము మట్టిలో కలిసి నశించి పోయినా, మళ్లీ మేము క్రొత్తగా సృష్టించబడ తామా? అసలు విషయం ఏమిటంటే వారు తమ ప్రభువును కలుసుకోవటాన్ని తిరస్కరిస్తారు. వారితో ఇలా అను, "మీపై నియమింపబడిన మృత్యుదూత మిమ్మల్ని పూర్తిగా కైవసం చేసుకుంటాడు, తరువాత మీరు మీ ప్రభువు వైపునకు మరలిం పబడి తీసుకుపోబడతారు."ఈ దోషులు తలలు వంచి తమ ప్రభువు సమక్షంలో నిలబడి ఉండే ఆ సమయాన్ని నీవు చూస్తే ఎంత బాగుండును! (అప్పుడు వారు ఇలా అంటారు), "మా ప్రభూ! మేము బాగా చూశాము, బాగా విన్నాము, ఇక మమ్మల్ని వెనక్కి పంపించు, మేము మంచిపనులు చేస్తాము. మాకు ఇప్పుడు నమ్మకం కలిగింది." (సమాధానంగా ఇలా అనబడుతుంది). (అస్సజ్దా: 10-12)

ఒకప్పుడు వారు త్రోసిపుచ్చిన విషయాల్ని ఇప్పుడు కళ్ళారా చూసుకుంటారు. ఒకప్పుడు పరిహసించిన వాటిని గురించి

ప్రత్యక్షంగా వింటారు. అల్లాహ్ హెచ్చరికలోని వాస్తవికత వారికి బోధపడుతుంది. ప్రవక్తలు (అ) తెలియజేసిందంతా సత్యమని అప్పుడు వారికర్థమవుతుంది. కానీ, ఏం లాభం? కర్మలు చేసుకోవడానికి వారికివ్వబడిన గడువు తీరిపోయింది. ఇప్పుడు వారి కోసం మిగిలిందల్లా పరాభవంతో కూడిన శిక్షే. వారు ప్రాపంచిక జీవితంలో దైవాన్ని, ఆయన శాసనాల్ని, ఆయన పంపగా వచ్చిన ప్రవక్తల ప్రవచనాల్ని పెడ చెవిన పెట్టారు, ఖాతరు చేయలేదు, విస్మరించారు. కాబట్టి ఈ రోజు అల్లాహ్ కూడా వారి గోడును పట్టించుకోడు. మనిషి మరణం తర్వాత ఎన్నో మజిలీలు ఉంటాయి. సమాధి పర లోకపు తొలి మజిలీ అయితే మహ్షర్ అనే చివరి మజిలీలో ఎక్కడి వెళ్ళాలో తీర్పు ఇవ్వబడుతుంది. "ఓ బృందం స్వర్గంలో, మరో బృందం నరకంలో". (షూరా: 7)

ఒక సోదరుడేమో ఆటపాటలే జీవితమని తలపోస్తున్నాడు. మరొక మిత్రుడు దైవాదేశాలను శిరసావహించడమే, ఆయన్ను ఆరాధించడమే జీవిత అర్థంగా, పరమార్థంగా భావిస్తున్నాడు. ఒక సోదరుడేమో అశ్లీల కార్యాల్లో, నీతిమాలిన పనుల్లో ఖర్చు పెట్టేందుకు ధనాన్ని కూడబెడుతున్నాడు. ధనమే మనిషిని నడిపే ఇంధనం అని నమ్ముతున్నాడు. తనకు ప్రాప్తయిన సిరిసంపదలు కలకాలం ఉంటాయనీ, వాటి ప్రాతిపదికనే కీర్తిప్రతిష్టలు ఒనగూడుతాయని భావిస్తున్నాడు. మరొక మిత్రుడు అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టాలనీ, తల్లిదండ్రుల సేవలు చేయాలని, అనాథలను, నిరుపేదలను, వికలాంగులను, వితంతువులను ఆదుకోవాలనీ, నిస్సహాయులకు, నిరాధార జీవులకు అండగా నిలవాలనీ, బంధుమిత్రులతో, ఇరుగుపొరుగువారితో సత్సంబంధాలు పెంపొందించుకోవాలనీ ధర్మం సమ్మతించిన పద్ధతిలో ధనాన్ని అర్జిస్తున్నాడు. ఒక సోదరుడేమో- విదేశాలకు వెళ్ళి విలాసాల్లో, కులాసాల్లో గడుపుతూ, అక్కడ హాయిని పొందాలని, బులపాటం తీర్చుకోవాలని, మధుపానం మైకంలో మునిగి తేలాలని కోరుకుంటున్నాడు. మరొక మిత్రుడు- హజ్జ్-ఉమ్రాల కొరకు మక్కా వెళుతున్నాడు. ఆఫ్రికన్ దేశాలలో నివసిస్తూ కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న అభాగ్యుల వద్దకెళ్ళి రేయింబవళ్ళు వారి సేవలోనే సమయం గడుపుతున్నాడు. దైవాభీష్టానికి అనుగుణంగా జీవించి శ్వాస వదలాలని సుదూర ప్రయాణాలు చేస్తున్నాడు. ఇలా భిన్న దృక్పథాలు గల ఈ ఇరువురూ సమానులేనా? కారు, ఎన్నటికీ కాలేరు. అవును ఇది అక్షర సత్యం - "నరకానికి ఆహుతి అయ్యేవారు, స్వర్గానికి పోయేవారు సమానులు కాలేరు". (హష్ర్: 11)

నిజ దైవాన్ని గ్రహించి, మిథ్యా దైవాలను విడనాడమని, అయిదు పూటల నమాజు పాటించమని, జకాత్ చెల్లించమని, శాంతిని సర్వ వ్యాప్తం చేయమని, అన్నదానాలు చేపట్టమని మనిషికి పలు విధాలుగా బోధించడం జరిగింది. "కాని అతను తిరస్కరించాడు. పరిహసించాడు. పరలోక జీవితముందని అంగీకరించలేదు. ఆపై సత్య మార్గానికి వ్యతిరేకంగా పన్నాగాలు పన్నటానికి వెళ్ళిపోయాడు". (ఖియామా) రేపు ప్రళయ దినాన అల్లాహ్ ఇదే మనిషినుద్దేశించి (ఇక్కడ ముగ్గురు పండితులున్నారు)

"ఓ మానవుడా! నేను మీకు ఆరోగ్యవంతమయిన శరీరాన్ని ఇవ్వలేదా! కాని మీరు ఈ శరీరాన్ని నా ప్రసన్నతను బడసే మార్గంలో ఉపయోగించ లేదు" అంటాడు. వారిలో ఒకడికి అప్పుడు గుర్తుకొస్తుంది. తను చేసిన పాపాలన్నింటిని తలచు కుంటాడు. నీతిని గురించి, న్యాయాన్ని గురించి ఊక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చానేగానీ, ఏనాడయినా పిసరంతయినా పాటించిన పాపానికి పోలేదు. నాదంతా వేషధారణ బ్రతుకు. భూ లోకంలోనేగానీ ఇక్కడ అబద్ధమాడి తప్పించు కునేందుకు లేదు. సంగీత దర్శకులు, సినీ దర్శకులు, నటులు, నటీమణులు, కలిమి బలిమి గలవాళ్ళెందరో నా వద్దకొచ్చి ఆశీర్వాదం పొంది వెళ్ళేవారు. ఓ మోస్తరు తప్పు చేసేవారు కూడా నన్ను చూసి వణికిపోయే వారు. నేను మాత్రం రహస్యంగా పాపాలకు పాల్పడి ఏమీ ఎరుగని వాడిలా నటించేవాడిని. ప్రసంగాల్లో బహు దైవారాధన ఎంత ఘోరమయిన పాపమో శ్రోతల హృదయాలు కంపించిపోయేలా గద్దించే వాడిని. కానీ బహిరంగంగానే దర్గాహ్ (సమాధి)పై పీఠాధిపతినయి కూర్చునేవాడిని. ఫాతెహాలు, పది మంది స్త్రీల కహానీలంటూ ప్రజలను భ్రష్టు పట్టించడమే కాక వారి సంపదను కొల్లగొట్టే వాడిని. భార్యాభర్తలెలా సఖ్యతగా మెలగాలనే విషయంపై ఉపన్యసించి ఇంటి కెళ్ళినప్పటి నుండి భార్యతో తిట్ల తాంబూలాలు, కొట్లాటలు. అతనిప్పుడు రక్త కన్నీరు కారుస్తున్నాడు, కాని ఫలితం లేదు.

మరో మనిషి - తనో మహా సంఘ సేవకుడని, అనాథలకు ఆశ్రయం వంటి వాడని, విధవరాళ్ళను, వయస్సుడిగిన వారికి ఆపద్బాంధవుడి లాంటి దాతని, మహా నేత అని అతన్ని జనాలు పొగిడారు. ఉదయమొక దేశంలో, మధ్యాహ్నం మరొక దేశంలో, రాత్రి ఇంకొక దేశంలో భోం చేశాడు. విదేశాల్లో కూడా తన వాగ్ధాటికి, పవిత్ర జీవనానికి గులాములయిన వారు కోకొల్లలు.

మిగతా 34వ పేజీలో...




## అసోం సీఎం విద్వేష వ్యాఖ్యలు

రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా అసోం ముఖ్య మంత్రి హిమంత బిస్వ శర్మ మైనారిటీలపై అక్కసు వెళ్లగక్కారు. బెంగాలీ మాట్లాడే ముస్లింలు రాష్ట్రాన్ని దోచుకునేందుకు అనుమతించబోమని అన్నారు. మైనారిటీ ఓట్ల పోటీలో తాను లేనని అన్నారు. మతవిద్వేషపు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ అసెంబ్లీ నుండి వాకౌట్ చేసింది. ఎగువ అస్సాంలోని శివసాగర్ జిల్లాలో మైనర్లపై అత్యాచారాలు సహా బెంగాలీ ముస్లింలను లక్ష్యంగా చేసుకోవడం వంటి కీలక అంశాలపై చర్చకు సంబంధించి ప్రతిపక్ష కాంగ్రెస్ వాయిదా తీర్మానంపై అసెంబ్లీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను చర్చను పక్కన పెడతానని.. మీరు ఏం చేస్తారని అన్నారు. మియా ముస్లింలు (బంగ్లాదేశ్ వలసదారులు) అసోంను స్వాధీనం చేసుకునేందుకు అనుమతించబోమని మతవిద్వేషపు వ్యాఖ్యలు చేశారు.

## సంకుచిత్వంతో దేశానికి ముప్పు

సంకుచిత జాతీయవాద ధోరణుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వుండాల్సిందిగా ప్రగతిశీల చింతనాపరులకు, సాంస్కృతిక కార్యకర్తలకు కేరళ సాహిత్య వేత్తలు పిలుపు నిచ్చారు. కేరళలో జరిగిన ఒక మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షులు కె. సచ్చిదానందన్ మాట్లాడుతూ దేశభక్తి పేరుతో దళితులు, ముస్లిమ్‌లపై హింస పెరగడాన్ని తీవ్రంగా ఖండించారు. సమైక్య హిందూ మతం అన్న భావనను ఆయన సవాలు చేశారు. భారత ప్రజల గురించి చెప్పేందుకు అరబ్బులు, యురోపియన్లు చారిత్రకంగా ఈ హిందూ పదాన్ని వాడేవారని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త పెట్టుబడిదారీ వాదం, హిందూత్వల సంకీర్ణమని ఆయన అభివర్ణించారు. ఫాసిజానికి సంబంధించిన అన్ని శక్తులు ఈ కూటమిలో వున్నాయన్నారు. భారతదేశాన్ని స్వేచ్ఛా భూమిగా మార్చేందుకు నిరంతర పోరాటం కొనసాగించాలని, అవిశ్రాంతంగా ప్రతిఘటన చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కేరళవ్యాప్తంగా 3 వేలకు పైగా సాహిత్య సంగమ్ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు, 650 మంది రచయితలు ఈ మహాసభలో పాల్గొన్నారు.

## వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలి

వక్ఫ్ బిల్లును ఎన్డీఏ మిత్రపక్షాలైన జేడీయూ, టీడీపీ వ్యతిరేకిస్తాయని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపిఎల్‌బి) అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ అన్నారు. చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్‌లను కలిశామని, వక్ఫ్ బిల్లుపై ఇరువురు నేతలు తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారని తెలిపారు. ఏఐఎంపిఎల్‌బి, జమీయత్ ఉలమా యె హింద్, ఇతర ప్రధాన ముస్లిం సంఘాలు సమిష్టిగా లోక్‌సభలో సమర్పించిన వక్ఫ్ (సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ఒకవేళ ఆమోదం పొందితే బిల్లును రద్దు చేసే వరకు దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతామని హెచ్చరించాయి.

## అమీన్ పటేల్‌కు ఉత్తమ శాసన సభ్యుని అవార్డు

మహారాష్ట్ర మంబాదీ నియోజక వర్గానికి చెందిన కాంగ్రెస్ శాసన సభ్యుడు అమీన్ పటేల్ ఉత్తమ శాసన సభ్యునిగా ఎంపికయ్యారు. ప్రజా ఫౌండేషన్ అనే ప్రముఖ ప్రయివేటు సంస్థ ఆయనకు ఉత్తమ శాసన సభ్యుని అవార్డు ఇచ్చి ఘనంగా సత్కరించింది. గతంలో ఈయన రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఒక ముస్లిమ్ శాసన సభ్యుడు అగ్ర స్థానంలో నిలవడం ఇదే మొదటిసారి. ఈ సంస్థ ఎమ్మెల్యేల పని తీరు, అసెంబ్లీలో హాజరీ, ప్రజలకు అందుబాటులో ఉండడం తదితర అంశాలను ఆధారంగా చేసుకుని ప్రతి సంవత్సరం ఒక శాసన సభ్యుడిని ఎన్నుకుని సత్కరిస్తుంది.

## మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళనకరం

మైనారిటీలను బీజేపీ లక్ష్యంగా చేసుకుంటోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. వారిలో భయాన్ని కలిగించడానికి బుల్డోజర్లను ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీల ఇళ్లపై బుల్డోజర్ చర్యను ఖర్గే ఖండించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ‘ఒకరి ఇంటిని కూల్చివేయడం, వారి కుటుంబాన్ని నిరాశ్రయులను చేయడం అమానవీయం, అన్యాయం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలపై పదే పదే దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రూల్ ఆఫ్ లా ప్రకారం పరిపాలించే సమాజంలో ఇలాంటి చర్యలకు చోటు లేదు’ అని ఎక్స్‌లో పేర్కొన్నారు. భోపాల్‌లో జరిగిన ఒక ఘటనలో ప్రధాన నిందితుడైన కాంగ్రెస్ నేత హాజీ షెహజాద్ అలీకి చెందిన బంగ్లాను అధికారులు ఇటీవల కూల్చేశారు. ఈ నేపథ్యంలో మల్లికార్జున్ ఖర్గే ఈ మేరకు స్పందించారు.

సర్వత్రా

## కుటుంబాలను కలిపి ఉంచుదాం

'కుటుంబాలను కలిపి ఉంచుదాం' పేరుతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ యంత్రాంగం ప్రకటించిన సరికొత్త విధాన నిర్ణయం లక్షలాది కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతోంది. ఈ నిర్ణయంతో చట్ట విరుద్ధంగా దేశంలో నివసిస్తున్న 5 లక్షల మంది దంపతులు, 50 వేల మంది సవతి పిల్లలు లబ్ధి పొందనున్నారు. యూఎస్ పౌరసత్వానికి అర్హత రావడంతో నిన్నటి వరకూ అనిశ్చితితో నిండిన వారి జీవితాల్లో నిశ్చింత ఏర్పడనుంది. జూన్‌లో ఈ పథకాన్ని ప్రకటించారు. ఆగస్టు 19 నుంచి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. యూఎస్ పౌరుని పెళ్లి చేసుకుని, కనిష్ఠంగా పదేళ్లనుంచి అక్కడే నివాసం ఉంటున్న దంపతులు ఈ పథకానికి అర్హులు. జూన్ 17, 2024 నాటికి పదేళ్లు పూర్తయి ఉండాలన్నది నియమం.

## మాక్రాన్ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడతాం

ఫ్రాన్స్‌లో ప్రధాని ఎన్నికలు జరిగి రెండు నెలలు గడిచాయి. ఎన్నికల్లో అతిపెద్ద శక్తిగా అవతరించిన వామపక్ష కూటమి అభ్యర్థిని ప్రధానిగా నియమించాల్సి ఉండగా, అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ మొండిగా తిరస్కరిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం పాల్జేస్తున్నారు. మాక్రాన్ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లోని వామపక్షాలు సెప్టెంబరు7న దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. గత నెలలో జరిగిన నేషనల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌పిఎఫ్ కూటమి (కమ్యూనిస్టులు, సోషలిస్టులు, గ్రీన్స్ పార్టీల కూటమి) అత్యధిక స్థానాలను గెలుచుకుంది. తదుపరి ప్రధాన మంత్రిగా తమ కూటమి తరపున ప్రధాని పదవికి పారిస్ సివిల్ సర్వెంట్ లూసీ కాస్టెట్స్ పేరును ప్రతిపాదించింది. అధ్యక్షుడు మాక్రాన్ వామపక్ష కూటమి అభ్యర్థిని ప్రధానిగా నియమించేందుకు ఒలింపిక్స్‌ను సాకుగా చూపారు. ఇప్పుడు పార్టీలతో మళ్లీ చర్చలు అంటూ కొత్త పల్లవి అందుకున్నాడు. అంతవరకు గాబ్రియేల్ అట్టల్‌ను ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగిస్తామన్నారు. మాక్రాన్ చర్య మతిమాలిన చర్యగా ఎన్‌ఎఫ్‌పి నేతలు విమర్శించారు. అధ్యక్షుడి వైఖరి మారకుంటే ఆయనపై అభిశంసన తీసుకొస్తామన్నారు. ప్రజాస్వామ్యమంటే లెక్కలేనితనంతో వ్యవహరిస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమని వారు హెచ్చరించారు.

## బంగ్లాదేశ్‌లో జమాఅతె ఇస్లామీపై నిషేధం ఎత్తివేత

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం జమాఅతె ఇస్లామీ బంగ్లాదేశ్ సంస్థను, దాని విద్యార్థి విభాగం ఇస్లామీ ఛాత్ర్ శిబిర్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. తాత్కాలిక ప్రభుత్వాధినేత ముహమ్మద్ యూనుస్ అన్ని ఆంక్షలను ఎత్తివేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. జమాఅత్ పై ఈ నిషేధం ఎత్తివేయడంతో జమాఅతె ఇస్లామీ పార్టీ తన రాజకీయ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించనుంది. రాజకీయ కక్షతోనే జమాఅతె ఇస్లామీని షేక్ హసీనా ప్రభుత్వం నిషేధం విధించిందని అందుకే నిషేధాన్ని ఎత్తివేస్తున్నామని న్యాయ వ్యవహారాల సలహాదారుడు ఆసిఫ్ నజ్రుల్ పేర్కొన్నారు. భారత్‌తో స్నేహ పూర్వక సంబంధాలను తాము కోరుకుంటున్నామని జమాఅతె ఇస్లామీ చీఫ్ షఫీఖుర్ రహ్మాన్ తెలిపారు.

## చిన్నారులను చిదిమేస్తున్న ఇజ్రాయిల్


పాలస్తీనా ప్రజలపై యుద్ధోన్మాదంతో రగిలిపోతున్న ఇజ్రాయిల్ చిన్నారులను చిదిమేస్తోంది. గాజాలో నెతన్యాహూ సైన్యం అత్యంత దారుణంగా, పాశవికంగా సాగిస్తున్న దాడుల్లో ఇప్పటి వరకు 40,500 మంది పైగా చనిపోగా వారిలో 26 శాతం మంది పసిపిల్లలే ఉన్నారు. దాదాపు 17 వేల మంది పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోగా వేలాది మంది పిల్లలు క్షతగాత్రులయ్యారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధనేరాలు మొదలై 320 రోజులు అయింది. గతేడాది అక్టోబరు 7 నుండి ప్రతి రోజూ 53 మంది చొప్పున పిల్లలు మృత్యువాత పడుతున్నారు. 72 మంది స్త్రీ, పురుషులు చనిపోతున్నారు. మరణించిన మహిళల శాతం 18.4 శాతంగా వుంది. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి అన్ని విధాలా నిస్సిగ్గుగా సహకారమందిస్తున్న అమెరికా మృత్యుముఖానికి పసి పిల్లల మరణాలే ఉదాహరణ అంటూ అమెరికా నగరాల వరకు చిన్నారుల శవ పేటికలు పేర్చవచ్చు అని చెబుతూ ఒక జర్నలిస్టు విశ్లేషణ చేశారు. ఇక దాడుల సందర్భంగా శిధిలాల కింద చిక్కుకుపోయి, మరణించి వుంటారని భావించిన వారు కనీసం 10వేల మంది వుంటారు. దాడులకు ముందు గాజా జనాభా 20 లక్షలు కాగా అందులో దాదాపు సగం మంది పిల్లలే. చనిపోయిన పిల్లలతో 550 క్లాస్ రూమ్‌లు నిండుతాయి. నిర్వాసితులైన పాలస్తీనియన్లు తల దాచుకోవడానికి స్కూళ్ళను ఉపయోగిస్తున్నారు. ఇటువంటివి 500కి పైగా స్కూళ్ళు వుండగా, వాటిని ఇజ్రాయిల్ లక్ష్యంగా పెట్టుకోవడంతో చాలావరకు ధ్వంసమయ్యాయి. 10 నెలల నుండి దాడులు కొనసాగుతుండడంతో గాజాలోని పిల్లలకు ఒక విద్యా సంవత్సరం పోయినట్లే.

## 31వ పేజీ తరువాయి...

వేల సంఖ్యలో అభిమానులు సభలకు హాజరయ్యే వారు. ఆంగ్లంలో ఏకధాటిగా ఉపన్యాసాలివ్వడమే కాక, ప్రముఖులు ఆంగ్లంలో ఇచ్చే ప్రసంగాలకు అను వాదకుడిన వ్యవహరించి ఆయా వ్యక్తుల మన్ననలు పొందేవాడు. ఎన్నో ఇళ్ళ స్థలాలు, పొలాలు, పేటకొక భవనం అంతా దేవుని అనుగ్రహం అన్న అతి వినయం ఒకటి.

ఇంకో మనిషి– వర్ణ విభేదాలు, కుల రచ్చలు, జాతి వైషమ్యాలు ఎందుకు చేసినట్టో? అతనికి ఇప్పుడే అర్థమయింది. తాను చెడింది గాక ఇతరులెందరినో చెడగొట్టాడు. సృష్టితాలను దైవ స్వరూపాలుగా, దైవాంశ సంభూతులుగా, దైవ అవతరాలుగా చిత్రీకరించి వాటినే పూజించాలని, అదే సనాతన మతం అని మాయమాటలు చెప్పి, అభూత కల్పనలను జోడించి, పుక్కిటి పురాణాలను వ్యాపింపజేసి యుగాల తరబడి మోసగించిన నేరం అతనిది. రోజుకో బూటకపు దైవాన్ని సృష్టించడం అతనికో ఆట. ఒక దేవునితో బోరు కొడితే వెంటనే మరో దేవుడ్ని ప్రతిష్టింప జేసేవాడు. సింహం, ఏనుగు, శునకం, వరహం కూడా దేవుళ్ళే. అతని వినోదం దేవతను సృష్టించడం. దేవుడొక్కడేనని, ఆయన అద్వితీయుడని, దేశ కాలాలకు పరిమితం కానివాడని, అవ్యక్త రూపుడయిన ఆయనను పాంచ భౌతిక ఆకారంగా తలంచి పూజించే వారు శుద్ధ అవివేకులని, మానవులంతా ఒక్కటేనని, ఒకే దేవుని దాసులని, నల్లవారికి తెల్లవారిపైగానీ, తెల్ల వారికి నల్లవారిపైగానీ ఎలాంటి ఆధిక్యత లేదు, దైవభీతితో తప్ప అని దైవప్రవక్తలు ప్రబోధించినా, దైవగ్రంథాలు ప్రకటించినా అతను లెక్క చేయలేదు. అతని స్వార్థం, మూర్ఖత్వం, మూఢ విశ్వాసాలే నేడు అత నిని భయంకర నరకానికి ఆహుతి చేశాయి. ఇక్కడి నుండి తను వెళ్ళలేడు. తనలాంటి వారికి ఈ యధార్థాన్ని చెప్పి సంస్కరించాలన్న కోరిక బలంగా ఉన్నా అది సాధ్యపడదు. ఈ విషయం తెలిసిన అతను విలవిల్లాడిపోతూ తన చేతులను కొరుక్కుంటూ:"అయ్యో నేను దైవప్రవక్తకు తోడుగా ఉంటే ఎంత బాగుండేది! అయ్యో నా దౌర్భాగ్యం! నేను ఫలానా వ్యక్తితో స్నేహం చేయకుండా ఉంటే ఎంత బాగుండేది! అతడి మాయలో పడి నేను నా వద్దకు వచ్చిన హితబోధను స్వీకరించలేదు. (ఫుర్ఖాన్: 28,29) అంటూ కుమిలిపోతున్నాడు. ఆ తర్వాత ఏం జరుగుతుంది? '(ఈ తీర్పు తరువాత) సత్యాన్ని తిరస్కరించినవారు, నరకం వైపునకు గుంపులు, గుంపులుగా తోలబడతారు. చివరకు వారు అక్కడకు చేరినప్పుడు దాని ద్వారాలు తెరువబడతాయి. (జుమర్: 71)

నరకం – దానికి ఏడు ద్వారాలు. "ఆ రోజు నరకం ముందుకు తీసుకురాబడుతుంది. ఆ దినమున మానవుడు తాను చేసుకున్నదంతా జ్ఞాపకం తెచ్చుకుంటాడు". (ఫజ్ర్:23, 24) "అయ్యో నా కర్మల పత్రం నాకు అసలు ఇవ్వబడకుండా ఉంటే, నా లెక్కేమిటో నాకు అసలు తెలియకుండా ఉండి ఉంటే ఎంత బాగుండేది". (హాఖ్ఖహ :25–27) అని వాపోతాడు. ఏదోక రోజు నేటను చేసిన ప్రతి దానికీ లెక్క చెప్పుకోవాల్సి వస్తుందని నేను ఏ మాత్రం ఆలోచించలేదే! "అయ్యో! నా ఆ మరణమే అంతిమ మరణమయి ఉండి ఉంటే ఎంత బావుండేది. నా ఆస్తిపాస్తులు నాకేవిధంగానూ పనికి రాలేదే! నా అధికారమంతా అంతరించి పోయిందే!" (27,28) అయ్యో నా సైన్యం ఏమ యింది? నా ఆజ్ఞను పాలించేవారు ఏమయ్యారు. నా కీర్తికందూతి ఎక్కడా? ఏ ఇంటి నిర్మాణం కోసం పేదల కడుపులు కొట్టానో, ఏ భార్యాపిల్లల కోసం అహర్నిశలు అవినీతి అక్రమార్కుడిలా వ్యవహరించానో, ఏ బూటకపు గౌరవం కోసం అఘాయిత్యాలకు పాల్పడ్డానో వారందరూ ఇప్పుడేమయ్యారు?అని రోదిస్తాడు. కాని అతని రోదన అరణ్య రోధనే అవుతుంది. అల్లాహ్ ఆజ్ఞ జారి చేయబడుతుంది: "అతనిని పట్టుకోండి. అతని మెడకు కంఠపాశం తగిలించండి. ఆపైన అతన్ని నరకంలో విసిరివేయండి. అతన్ని డెబ్భై గజాల పొడుగు గల గొలుసుతో బంధించండి". (హాఖ్ఖహ :30, 32)




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**